# మన బలగం
# MANA BALAGAM
Telugu Daily

| నిర్మల్ | సంపుటి:1 | సంచిక:1 | బుధవారం, డిసెంబర్ 18, 2024 | పేజీలు:8 | వెల:రూ.5.00/- |
|---|---|---|---|---|---|
| NIRMAL | Volume:1 | Issue:1 | Wednesday 18 December 2024 | Pages: 8 | Price: Rs:5.00 |


## రూ.లక్ష కోట్లు అప్పు మేము చేయలేదు



- రూ.52 వేల కోట్లు మాత్రమే అప్పు తీసుకున్నాము
- గతం ప్రభుత్వం అప్పులకు వడ్డీలు కడుతున్నాం
- సివిల్ సప్లై బిల్లులు కూడా రూ.62 వేల కోట్లు అప్పు చేసిపెట్టారు
- ప్రస్తుతం రైతులు పండిరచిన ప్రతి పంటను కొంటున్నాం
- సకాలంలో రైతులకు బిల్లులు చెల్లిస్తున్నాం
- ఉచిత కరెంటు ఇస్తున్నామని డిస్కంలకు కూడా డబ్బులు చెల్లించలేదు
- గతంలోని డిస్కం బిల్లులు కూడా మేమే చెల్లిస్తున్నాం
- ప్రతి శాఖలోనూ బకాయిలు ఉంచారు
- శాసనసభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్,డిసెంబర్ 17: తెలంగాణ అసెంబ్లీ మంగళవారం వాడివేడిగా సాగింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీ భగ్గుమనడంతో, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆందోళనలకు దిగారు. ఈసారి భట్టి విక్రమార్క తనదైన శైలిలో విరుచుకు పడడంతో చర్చ లో దుమారం లేచింది. రైతు కూలీల కోసం భూమి లేని వారికి ఏడాదికి రూ. 12 వేలు పథకంను ప్రభుత్వం ప్రవేశపెడుతున్న విషయం తెలిసిందే. ఈ పథకం అమల్లోకి తెచ్చేందుకు సీఎం రేవంత్ సర్కార్ అంతా సిద్దం చేస్తోంది. ఈ విషయాన్ని ఖమ్మం పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. మీరు రైతులకే పథకాలు వర్తింప జేస్తున్నారు, రైతు కూలీలకు ఏమి లేవా అనడంతో భట్టి ఖమ్మంలో ఏ మాట చెప్పాల్సి వచ్చింది. అయితే ఇదే విషయంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రివిలేజ్ మోషన్ చేయాలంటూ

మిగతా 2 లో



## స్పోర్ట్స్ వర్సిటీ బిల్లుకు
# శాసనసభ ఆమోదం

### యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ వర్సిటీ బిల్లుకు ఆమోదం

- విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం
- తెలంగాణ జీఎస్టీ సవరణ బిల్లుకూ ఆమోదం
- బీఆర్ఎస్, బీజేపీ సభ్యుల నిరసన బిల్లులకు ఆమోదం
- ఎలాంటి చర్చ లేకుండానే మూడు బిల్లులకు ఆమోదం
- జీఎస్టీ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టిన మంత్రి జూపల్లి
- జీఎస్టీ చట్ట సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం
- చర్చ లేకుండానే జీఎస్టీ చట్ట సవరణ బిల్లుకు..
- వాయిదా తీర్మానాల కోసం పట్టుబడుతున్న బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు
- లగచర్ల ఘటనపై చర్చకు విపక్షాల పట్టు
- సర్దిచెప్పేందుకు యత్నిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు
- నల్లచొక్కాలతో అసెంబ్లీకి బీఆర్ఎస్
- ఎఫ్ఆర్‌బీఎం రుణాలపై సభలో రగడ
- నిరసనల మధ్య శాసనసభ నేటికి వాయిదా

హైదరాబాద్, డిసెంబర్ 17 : తెలంగాణ శాసనసభ మూడు కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది. బీఆర్ఎస్, బీజేపీ సభ్యుల నిరసన మధ్య ఈ బిల్లులకు ఆమోదం తెలిపింది. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ వర్సిటీ బిల్లు, విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లు, తెలంగాణ జీఎస్టీ సవరణ బిల్లులకు ఆమోదం లభించింది. ఎలాంటి చర్చ లేకుండా బిల్లులను ఆమోదించారు. వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనపై అసెంబ్లీలో చర్చకు బీఆర్ఎస్ పట్టుబట్టింది. లగచర్ల రైతుకు సంకెళ్లు వేయడంపై చర్చ జరపాలని డిమాండ్ చేసింది. వాయిదా తీర్మానాల కోసం బీఆర్ఎస్, బీజేపీ డిమాండ్ చేశాయి. ప్రతిపక్షాల నిరసనల మధ్యే శాసనసభ మూడు బిల్లులను ఆమోదించింది. రాష్ట్ర పర్యాటక విధానంపై స్వల్పకాలిక చర్చ జరిగింది. ఆ తర్వాత సభ నేటికి వాయిదా పడిరది. ఎఫ్ఆర్‌బీఎమ్ రుణాలపై సభలో రగడ చోటు చేసుకుంది. మంగళవారం ఉదయం అసెంబ్లీ మొదలవగా.. స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు.

మిగతా 2 లో

## అవినీతి ఆరోపణలపై చర్చకు రెడీ



- ఈ-కార్ రేస్ అంశంపైనా చర్చకు సిద్ధమే
- దమ్ముంటే ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చ పెట్టాలి
- అసెంబ్లీ సమావేశాలు 15 రోజులు నిర్వహించాలి
- 100 శాతం రుణమాఫీ నిజమైతే రాజకీయ సన్యాసం చేస్తా
- రేవంత్ కు ఓటేసినందుకు కొడంగల్ ప్రజలు బాధపడుతున్నారు
- రేవంత్ రెడ్డి దొంగ హామీలు ఇచ్చారు
- రాహుల్ గాంధీ నుంచి కాంగ్రెస్ నేతలు చెప్పినవన్నీ అబద్ధాలే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్, డిసెంబర్ 17: అసెంబ్లీ సమావేశాలను 15 రోజులు నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని సమస్యలపై చర్చించేందుకు సిద్ధమని తెలిపారు. అవినీతి ఆరోపణలపై కూడా చర్చకు రెడీ అని పేర్కొన్నారు. ఈ %-% కార్ రేస్ అంశంపై కూడా చర్చకు సిద్ధమేనని స్పష్టం చేశారు. దమ్ముంటే ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. లగచర్ల రైతులనే కాదు.. సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టిన వారిని కూడా అరెస్టు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. సోషల్‌మీడియాలో పోస్టులు పెడితే పీడీ యాక్ట్ పెడతామని

మిగతా 2 లో

## తెలంగాణలో అధికంగా చలి తీవ్రత



- ఆదిలాబాద్‌లో కనిష్ఠంగా 6.2 డిగ్రీల ఉష్ణోగ్రత
- మరో రెండు రోజుల పాటు శీతల గాలులు వీచే అవకాశం

..2 లో

## ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ ఆలయంలో పోటెత్తిన భక్తులు



- వైభవంగా ప్రారంభమైన ధనుర్మాస ఉత్సవాలు
- స్వామి వారికి అత్యంత వైభవంగా పూజాది కార్యక్రమాలు

..2 లో

## లోక్‌సభ ముందుకు
# జమిలి ఎన్నికల బిల్లు

### బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్

- 129వ రాజ్యాంగ సవరణ ద్వారా సభలోకి బిల్లు
- ఓటింగ్ కోరిన విపక్ష సభ్యులు
- స్పీకర్ హైబ్రిడ్ విధానంలో ఓటింగ్
- అనుకూలంగా 269, వ్యతిరేకంగా 198 ఓటు
- ఒకే దేశం.. ఒకే ఎన్నికల బిల్లుకు లోక్‌సభ అనుమతి
- బిల్లును జేపీసీకి పంపేందుకు లోక్‌సభ ఆమోదం
- తీవ్రంగా వ్యతిరేకించిన విపక్షాలు
- రాజ్యాంగ విధ్వంసం అంటూ ఆందోళన
- రాష్ట్రాల హక్కులను దెబ్బతీయడమేనన్న టీఎంసీ



న్యూఢిల్లీ, డిసెంబర్ 17: కేంద్ర మంత్రి, తెలుగు దేశం పార్టీ సభ్యుడు పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఈ బిల్లును స్వాగతిస్తున్నట్టు తెలిపారు. జాతి నిర్మాణానికి ఈ బిల్లు దోహద పడుతుందని చెప్పారు. కాగా.. ఈ బిల్లును ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, ఆర్జేడీ తదితర పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. పలువురు సభ్యులు మాట్లాడుతూ.. ఈ బిల్లు ఆమోదం పొందితే కేంద్ర ఎన్నికల సంఘానికి మరిన్ని అధికారాలు ఇచ్చినట్టేనని తెలిపారు. అధికార పక్షానికి సభలో మూడిరట రెండు వంతుల మంది సభ్యుల మద్దతు లేనప్పడు ఈ బిల్లును ఎలా తీసుకువస్తారని ప్రశ్నించారు. ప్రధానంగా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించిం ది. వచ్చే ఏడాది ఈ రాష్ట్రంలో ఎన్నికలు ఉన్న నేపథ్యంలో తృణమూల్ సభ్యులు వ్యతిరేకించడం గమనార్హం. అయితే.. ఎన్డీయే కూటమిలోని జేడీయూ, జేడీఎస్ నాయకులు మౌనంగా ఉన్నారు. ఇక, బీజేపీ సభ్యులు మాత్రం ప్రతిపక్షాల వైఖరిని ఎండగట్టారు. ప్రతి బిల్లును

మిగతా 2 లో

## రాజన్న కోడెల పంపిణీకి అనుమతి తప్పనిసరి



- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- గోశాలలో ప్రతి కోడె, ఆవు వివరాలు ప్రతి రోజూ రిపోర్ట్ చేయాలి
- అనుమతి లేకుండా మూడో దశ పంపిణీ ఎలా జరిగింది?
- పంపిణీ చేసిన 1975 పశువుల ప్రస్తుత స్తితిగతులపై శుక్రవారం నాటికి నివేదిక అందించాలి
- కోడెలు, ఆవులు పంపిణీ చేసే లబ్ధిదారుల జాబితాపై కలెక్టర్ సంతకం లేనంత వరకు జాబితా ఫైనల్ కాదు
- వేములవాడ ఆలయ గోశాల పటిష్ఠ నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై రివ్యూ

మనబలగం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి: వేములవాడ రాజన్న దేవాలయ గోశాలకు సంబంధించిన కోడెల పంపిణీకి జిల్లా కలెక్టర్ అనుమతి తప్పనిసరి అని, అనుమతి లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ గోవులను పంపిణీ చేసేందుకు వీలులేదని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను

మిగతా 2 లో

## లోక్‌సభ ముందుకు
# జమిలి ఎన్నికల బిల్లు

మొదటి పేజీ తరువాయి

అడ్డుకుంటున్నారని ప్రతిపక్ష సభ్యులు విమర్శించారు. దీనిపై చర్చ సాగుతుందని.. జాయింట్ పార్లమెంటరీ కమిటీని కూడా ఏర్పాటు చేస్తామని బీజేపీ సభ్యులు తెలిపారు. అయితే.. అసలు సభలో అధికార పక్షానికి బలం లేనప్పుడు.. ఈ బిల్లును తీసుకురావడంలో ఔచిత్యం ఏంటని కాంగ్రెస్ సభ్యులు నిలదీశారు. మొత్తంగా లోక్‌సభలో పెద్ద ఎత్తున దుమారం రేగింది. ప్రతిపాదించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా, కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించిన చట్ట సవరణ బిల్లును కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘూవాల్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఎన్డీయే మిత్ర పక్షాలు ఈ బిల్లులకు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. కానీ ఈ జమిలి బిల్లును కాంగ్రెస్ సహా విపక్షాలు అన్నీ తీవ్రంగా వ్యతిరేకించాయి. పూర్తి స్థాయి చర్చ జరిగేందుకు వీలుగా ఈ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపనున్నారు. జమిలి బిల్లును లోక్‌సభ పరిగణనలోకి తీసుకోవడంపై విపక్ష సభ్యులు ఓటింగ్ కోరారు. ఇందుకు అంగీకరించిన స్పీకర్ హైబ్రిడ్ విధానంలో ఓటింగ్ నిర్వహించారు. 360 మంది ఎలక్ట్రానిక్ ఓటింగ్‌లో, మరికొందరు బ్యాలెట్ పద్ధతిలో ఓటు వేశారు. ఎలక్ట్రానిక్ పద్ధతిలో అనుకూలంగా 269 మంది, వ్యతిరేకంగా 198 మంది ఓటు వేశారు. దీనితో జమిలి ఎన్నికల బిల్లులు ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ ఆమోదం లభించినట్లు అయ్యింది. ఓటింగ్?కు ముందు జమిలి బిల్లుపై విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ''129వ రాజ్యాంగ సవరణ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకం. రాజ్యాంగ మౌలిక స్వరూపంపై దాడి చేస్తున్న ఈ బిల్లులను వ్యతిరేకిస్తున్నాం'' అని కాంగ్రెస్ సభ్యుడు మనీశ్? తివారీ స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్‌కు విరుద్ధంగా బిల్లులను ప్రవేశపెట్టారని ఆయన మండిపడ్డారు. ''రాజ్యాంగ సవరణ బిల్లు దేశ ఎన్నికల ప్రక్రియనే సమూలంగా మార్చివేస్తుందని, దీనిపై చర్చ జరగాలని'' ఆర్ఎస్పీ సభ్యుడు ప్రేమచంద్ర పట్టుబట్టారు.''ఏకకాల ఎన్నికల బిల్లు ద్వారా రాజ్యాంగ విధ్వంసానికి పాల్పడుతున్నారు'' అని సమాజ్ వాదీ నేత ధర్మేంద్ర యాదవ్ ఆరోపించారు. జమిలి ఎన్నికలు నియంతృత్వానికి దారి తీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ''జమిలి ఎన్నికలంటే రాష్ట్రాల హక్కులను దెబ్బతీయడమే'' అని టీఎంసీ సభ్యుడు కల్యాణ్ బెనర్జీ ఆరోపించారు. జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి వైరస్ లాంటివని విమర్శించారు. కేవలం ఒక వ్యక్తి (మోదీ) కలను నెరవేర్చేందుకే బిల్లు పెట్టారని బెనర్జీ ఆరోపించారు. జమిలి బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు డీఎంకే సభ్యుడు టీఆర్ బాలు చెప్పారు. ఎన్డీయే మిత్రపక్షమైన టీడీపీ జమిలి ఎన్నికల బిల్లుకు మద్దతు తెలిపింది. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ బిల్లుకు మద్దతు తెలపగా, విపక్ష సభ్యుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. శివసేన ఉద్ధవ్ వర్గం బిల్లును వ్యతిరేకించగా, శిందే వర్గం సభ్యులు మద్దతు తెలిపారు. ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్, ఎంఐఎం, సీపీఎం సభ్యులు బిల్లును వ్యతిరేకించారు. ఎన్సీపీ ఎస్పీ సభ్యురాలు సుప్రియా శూలే బిల్లును వ్యతిరేకించారు. టీఆర్ బాలు కోరినట్లు బిల్లును జేపీసీకి పంపించి చర్చకు ముగింపు పలకాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సూచించారు. సమాఖ్య స్ఫూర్తికి జమిలి బిల్లు విరుద్ధం కాదని న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ చెప్పారు.

## స్పోర్ట్స్ వర్సిటీ బిల్లుకు
# శాసనసభ ఆమోదం

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌బీఎమ్ రుణాలపై మాజీ మంత్రి హరీష్ రావు అడిగిన ప్రశ్నకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సమాధానం ఇచ్చారు. 2024 నవంబర్ వరకు ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన రుణాలు రూ.51,200 కోట్లు అని భట్టి తెలిపారు. అయితే భట్టి విక్రమార్క వ్యాఖ్యలపై హరీష్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి రూ.7 లక్షల కోట్ల అప్పు ఉందనేది అవాస్తవమన్నారు. రూ.51 వేల కోట్ల అప్పు చేశామని ఒప్పుకున్నారన్నారు. ఇవాళ మరో రూ.3 వేల కోట్ల అప్పు తీసుకున్నారని.. ఒక్క ఏడాదిలో లక్షా 27వేల కోట్ల అప్పులు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో రూ.4 లక్షల కోట్ల అప్పులు చేశామని చెప్పుకొచ్చారు. గోరంతను కొండత చేసి గ్లోబల్స్ ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నారని హరీష్ మండిపడ్డారు. ఆదాయాన్ని సమకూర్చడంలో కాంగ్రెస్ పార్టీకి అపారమైన అనుభవం ఉందని.. హామీలను నెరవేర్చడమం పెద్ద సమస్యే కాదని ఎన్నికల ముందు భట్టి విక్రమార్క చెప్పారని గుర్తుచేశారు. అయితే అధికారంలోకి వచ్చాక ఏడాది అయింది హామీలు నెరవేర్చమని అడిగితే అప్పుల పేరు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి ఏడు లక్షల కోట్లు అని కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం అంతా తప్పు అని సభ ద్వారా చెబుతున్నట్లు మాజీ మంత్రి తెలిపారు.అయితే హరీష్ రావు వ్యాఖ్యలపై మంత్రి భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. సభను బీఆర్ఎస్ తప్పువదోవ పట్టిస్తోందని మండిపడ్డారు. అప్పులపై చర్చ జరగాలనే శ్వేతపత్రం విడుదల చేశామన్నారు. ''అప్పులపై చర్చకు మేం సిద్ధం.. బీఆర్ఎస్ సిద్ధమా?'' భట్టి సవాల్ విసరగా.. అందుకు మాజీ మంత్రి హరీష్ రావు సై అన్నారు. భట్టి సవాల్‌ను స్వీకరిస్తున్నామని.. అప్పులపై చర్చకు సిద్ధమని హరీష్ రావు ప్రకటించారు. మరోవైపు రేవంత్ ప్రభుత్వంపై తాము ఇచ్చిన ప్రివిలేజ్ మోషన్ అనుమతించాలని సభలో హరీష్ రావు కోరారు. ఇప్పటికిప్పుడు అప్పులపై చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. సమావేశాలు ముగిసేలోపైనా అప్పులపై చర్చించాలని పట్టుబడ్డారు. ప్రభుత్వం చెప్తున్న అప్పులకు, వాస్తవ అప్పులకు తేడా ఉందని హరీష్ రావు స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ ఇచ్చిన ప్రివిలేజ్ మోషన్‌పై భట్టి మాట్లాడుతూ.. ''బీఆర్ఎస్ సభ్యులా మాపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చేది. బీఏసీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. గడిచిన పదేళ్లు బీఏసీ ఎలా నిర్వహించారో మర్చిపోయారా? గతంలో పాటించిన నిబంధనలే ఇప్పుడూ పాటించాలి కదా ఎవరైనా రూల్స్ బుక్ ప్రకారమే నడవాలి'' అని మంత్రి భట్టి వ్యాఖ్యలు చేశారు. ఆర్థిక విధ్వంసం చేసిన బీఆర్ఎస్ నేతలు నీతులు మాట్లాడడం ఏంటి? అని ప్రశ్నించారు. పెండిరగ్ బిల్లులు ఉన్నాయని.. ఆ బిల్లులు పెండిరగ్‌లో పెట్టింది బీఆర్ఎస్ అని వ్యాఖ్యలు చేశారు. 40 వేల కోట్ల రూపాయలు బీఆర్ఎస్ ప్రభుత్వం పెండిరగ్ పెట్టిందని తెలిపారు. ప్రతి గింజా తామే కొంటామని సివిల్ సప్లయ్‌లో 18 వేల కోట్ల బకాయిలు పెట్టారన్నారు. హరీష్ రావుకు ఎప్పుడు నిజాలు మాట్లాడే అలవాటు లేదని.. హరీష్ రావు అబద్ధాలు చెబితే అలవాటులో పొరపాటు అనుకున్నామన్నారు. శాసనసభ వ్యవహారాల మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి కూడా అబద్ధాలు మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. '' అప్పుల విషయంలో ప్రభుత్వం చాలా క్లారిటీగా ఉంది. చేసిన అప్పులను దాచే పరిస్థితి లేదు. నిజాలు చెప్తే ప్రివిలేజ్ మోషన్ అంటే ఊరుకోవాలా? ప్రతి ఆరు నెలలకు ఒకసారి బీఆర్ఎస్ పార్టీ నాయకులకు మైండ్ పోతుంది. ప్రజలు ఎన్నిసార్లు తిరస్కరించిన వాళ్లలో మార్పు రావడం లేదు. అప్పులు ఆస్తుల విషయంలో చర్చించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. హరీష్ రావు సవాళ్లు స్వీకరిస్తున్నాను చర్చకు నేను రెడీ'' అని మంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల చొక్కాలు, చేతులకు బేడీలతో అసెంబ్లీకి వచ్చారు. లగచర్ల రైతులకు బేడీలు వేసినందుకు నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వినూత్నంగా అసెంబ్లీకి వచ్చారు. రైతులకు బేడీలు వేస్తారా అంటూ గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు. తెలంగాణ శాసనసభ సమావేశాలు అధికార కాంగ్రెస్ సభ్యులు వర్సెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులుగా కొనసాగుతున్నాయి. వికారాబాద్ జిల్లా లగచర్లలో రైతుల అరెస్ట్ ఘటనపై సభలో చర్చకు బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు. చర్చకు బీఆర్ఎస్ ఇచ్చిన పిటిషన్‌ను స్పీకర్ ప్రసాద్ కుమార్ తోసిపుచ్చారు. మరోవైపు వాయిదా తీర్మానాల కోసం బీజేపీ, బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేసినా ప్రయోజనం లేకపోయింది. విపక్షాల నిరసనల మధ్య తెలంగాణ అసెంబ్లీ 3 కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది. విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లు, తెలంగాణ జీఎస్టీ సవరణ బిల్లులతో పాటు యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ వర్సిటీ బిల్లులను రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించింది. విపక్ష సభ్యులు లగచర్లలో రైతుల చేతికి సంకెళ్లు వేయడం దారుణమంటూ విపక్షాలు గగ్గోలు చేస్తుండగా నిరసనల మధ్య మూడు బిల్లులకు ఆమోదం లభించింది. చర్చ జరపకుండా బిల్లులను ఆమోదించడంపై విపక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. అనంతరం రాష్ట్రంలో పర్యాటక రంగంలో చేయాల్సిన మార్పులు, నూతన విధానంపై కొంతసేపు చర్చ జరగగా.. తెలంగాణ అసెంబ్లీ బుధవారానికి వాయిదా పడిరది. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు వచ్చిన బాధలు ఎవరికీ రావద్దని ఏకంగా మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం అసెంబ్లీ లాబీలో మంత్రి సీతక్క ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. అది కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఉద్దేశించి కావడం గమనార్హం. తెలంగాణ అసెంబ్లీ మంగళవారం ప్రారంభమైంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఇతర పార్టీల ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చారు. కానీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాత్రం ఇంకా రాలేదని అందరూ అనుకుంటుండగా, కొందరు చేతులకు బేడీలు ధరించి ఇదేమి రాజ్యం, ఇదేమి రాజ్యం అంటూ నినాదాలు చేస్తూ వస్తున్నారు. ఇక బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆ తరహాలో వస్తుంటే కేటీఆర్, హరీష్ రావులు కూడా అదే తరహాలో వస్తారంటూ.. అందరూ ఎదురుచూపుల్లో ఉండగా, ఆ ఇద్దరు మాత్రం సాఫీగా వచ్చారు. అంతేకాదు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరూ బ్లాక్ షర్ట్స్ ధరించి రావడం విశేషం. ఈ విషయంపై మీడియా కూడా అంతగా దృష్టి సారించని సమయంలో మంత్రి సీతక్క అసెంబ్లీ లాబీ వద్దకు వచ్చారు. సీతక్క మాట్లాడుతూ.. కేటీఆర్, హరీష్ రావులు తమ చేతులకు బేడీలు వేసుకోకుండా, కేవలం ఆ పార్టీ ఎమ్మెల్యేలకు బేడీలు వేయించి నిరసన వ్యక్తం చేయడం చూసి ఆశ్చర్యపోయినట్లు తెలిపారు. ఈ వ్యవహారంతోనే కేటీఆర్, హరీష్ రావుల దొరతనం మరోసారి బయటపడిరదన్నారు. నిరసన వ్యక్తం చేయడంలోనూ బీఆర్ఎస్ నేతలో సమానత్వం లేదని, తమ దురహంకారాన్ని కేటీఆర్, హరీష్ లు బయట పెట్టారన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు కనీసం 10 సార్లు బేడీలు వేశారని, అప్పుడు అధికారుల మీద చర్యలు లేవన్నారు. ప్రస్తుతం రైతుకు బేడీలు వేసిన అంశంపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసి చర్యలు కూడా తీసుకున్నారన్నారు. ఆమాత్రం కూడా తెలియకుండా బీఆర్ఎస్ ఉనికిని కాపాడుకునేందుకు తెగ తాపత్రయ పడుతుందంటూ మంత్రి సీతక్క అన్నారు. ఇలా మంత్రి సీతక్క చెప్పగానే, మీడియా లాబీలోని ప్రతినిధులు ఔను నిజమే కదా, మనం గమనించలేక పోయామేనంటూ చర్చించుకోవడం విశేషం. మొత్తం మీద సీతక్క చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్‌గా మారాయి.

# తెలంగాణలో అధికంగా చలి తీవ్రత

హైదరాబాద్, డిసెంబర్ 17 : తెలుగు రాష్ట్రాలపై చలి పంజా విసురుతోంది. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలులతో ఏపీ, తెలంగాణలో ఉష్ణోగ్రతలు కనిష్ఠానికి పడిపోయాయి. తెలంగాణలో మరో రెండు రోజుల పాటు పలు జిల్లాల్లో శీతల గాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడిరచింది. సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు తక్కువగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. తెలంగాణలోని ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో శీతల గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో...ఎల్లుండి తెలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పలు ప్రాంతాల్లో కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. అల్పపీడనం రానున్న 2 రోజుల్లో మరింత బలపడి పశ్చిమ-వాయువ్య దిశగా తమిళనాడు తీరం వైపు కదిలే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు. హైదరాబాద్ లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఉదయం వేళల్లో పొగమంచు ఉండే అవకాశం ఉందని పేర్కొంది. ఉపరితల ఈశాన్య దిశలో చలిగాలులు గంటకు 2-6 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందని తెలిపింది. హైదరాబాద్ లో ఇవాళ గరిష్ఠ ఉష్ణోగ్రత 29.6 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 11.9 డిగ్రీల సెల్సియస్ నమోదు అయినట్లు వాతావరణ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 65 శాతంగా పేర్కొన్నారు. తెలంగాణలో చలి తీవ్రత అధికంగా ఉంది. ఆదిలాబాద్ లో కనిష్ఠంగా 6.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు అయిందని వాతావరణ కేంద్రం తెలిపింది. పటాన్ చెరులో 7 డిగ్రీలు, మెదక్ లో 7.5, రాజేంద్ర నగర్ లో 8.5 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిరదని వాతావరణ శాఖ తెలిపింది. అనుబంధ ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 5.8 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉందని పేర్కొంది. అల్పపీడనం రానున్న రెండు రోజులలో బలపడి పశ్చిమ-వాయువ్య దిశగా తమిళనాడు తీరం వైపు కదిలే అవకాశముందని తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రాగల మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొంది. అల్లూరి సీతారామ రాజు జిల్లా అరకు లోయలో సోమవారం 3.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. జి మాడుగులలో 4.1 డిగ్రీలు, డుంబ్రిగూడలో 7.3 డిగ్రీలు, చింతపల్లి, ముంచంగిపుట్టులో 8.1డిగ్రీలు, హుకుంపేటలో 8.8 డిగ్రీలు, పెదబయలులో 9.0, అనంతగిరిలో 9. 4, కళింగపట్నంలో 13.2 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఏడాది తొలిసారి సోమవారం ఏజెన్సీలో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి తీవ్రతకు గిరిజనులు వణుకుతున్నారు. పగటి పూట కూడా వాహనాలను లైట్లు వేసుకుని ప్రయాణించాల్సి వస్తోంది. అల్పపీడనం ప్రభావంతో బుధవారం నుంచి చలి స్వల్పంగా తగ్గుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఏజెన్సీ ప్రాంతాలలో చలి వణికిస్తోంది. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పడిపోతున్నాయి. అల్లూరి సీతారామ రాజు జిల్లాలోని 16 ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 10 డిగ్రీలలోపే నమోదయ్యాయి. అరకులో 3.8, డుంబ్రిగుడలో 6, గూడెం కొత్తవీధిలో 7.9. హుకుంపేటలో 7.8 డిగ్రీలు నమోదయ్యాయి. పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, కర్నూలు, శ్రీసత్యసాయి, అనకాపల్లి, అనంతపురం, నంద్యాల, చిత్తూరు, ఎన్టీఆర్, ప్రకాశం, పల్నాడు, అన్నమయ్య, ఏలూరు. జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలకంటే తగ్గాయి. తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, ఛత్తీస్ గఢ్ రాష్ట్రాల సరిహద్దులోని అన్ని జిల్లాల్లో మంగళ వారం చలి తీవ్రత కొనసాగుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. బంగాళఖాతంలో అల్పపీడన ప్రభావంతో మూడు రోజుల తర్వాత వాతావరణం కొంత మార్పు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# రాజన్న కోడెల పంపిణీకి అనుమతి తప్పనిసరి

మొదటి పేజీ తరువాయి

హెచ్చరించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వేములవాడ ఆలయ గోశాల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ఇక నుంచి జిల్లా కలెక్టర్ అనుమతి లేకుండా ఎట్టి పరిస్థితులలో గోశాల నుంచి కోడెలను, ఆవులను రైతులకు పంపిణీ చేసేందుకు వీలు లేదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 1975 పశువులను గోశాల నుంచి పంపిణీ చేశామని, వీటిలో మొదటి దశలో 1278 కోడెలు, 75 ఆవులు, రెండవ దశలో 389 కోడెలు, 45 ఆవులు, మూడవ దశలో 188 కొడెలు పంపిణీ చేసామని అధికారులు వివరించారు. మొదటి, రెండు దశలకు మాత్రమే జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకొని పంపిణీ చేయగా, కలెక్టర్ నుంచి ఎటువంటి అనుమతి లేకుండా మూడవ దశ పంపిణీ ఎలా జరిగిందని కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. మూడవ దశ పంపిణీకి గల కారణాలపై సమగ్ర నివేదిక అందించాలని, దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. వచ్చే శుక్రవారం నాటికి జిల్లాలో పంపిణీ చేసిన 1975 పశువుల స్థితిగతులపై నివేదిక సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పశువులను పంపిణీ చేసే సమయంలో వాటికి ట్యాగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. రెవెన్యూ డివిజన్ కార్యాలయం, పోలీస్ సిబ్బంది విచారించి ఎంపిక చేసే వరకు ఏ లబ్ధిదారుడికి గోశాల నుంచి పశువులను ఇతర జిల్లాలకు పంపిణీ చేసేందుకు వీలు లేదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు వేములవాడలోని 2 గోశాలలు, ఆలయ ఆవరణలో గల కోడెలు, ఆవులు ఇతర పశువుల వివరాలు తెలియ జేయాలని కలెక్టర్ తెలిపారు. కోడెలు, ఆవుల పంపిణీ చేసే లబ్ధిదారుల జాబితాపై కలెక్టర్ సంతకం లేనంత వరకు జాబితా ఫైనల్ కాదని స్పష్టం చేశారు. వేములవాడ ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతి వారం రివ్యూ సమావేశం ఉంటుందని, నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు జరగాలని, ఎక్కడ ఎటువంటి అవకతవకలు ఉండటానికి వీలులేదని, ఆలయానికి సంబంధించిన ప్రతి అంశం తన దృష్టికి రావాలని పేర్కొన్నారు. వేములవాడ ఆర్డీఓ రాజేశ్వర్, వేములవాడ ఆలయ ఇన్‌చార్జి ఈవో రాజేశ్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, డీపీఆర్వో వి.శ్రీధర్, తహసిల్దార్ మహేశ్ ఉన్నారు.

# రూ.లక్ష కోట్లు అప్పు మేము చేయలేదు

మొదటి పేజీ తరువాయి

గగ్గోలు పెట్టారు. ఈ విషయంపై స్పందించిన భట్టి విక్రమార్క మైక్ అందుకొని మాటలకు పదును పెట్టారు. ఏమి మీ భూస్వామ్య రాజ్యం, తట్టుకోలేక పోతున్నారా, రైతులతో పాటు కూలీలకు తాము పథకాలు ప్రవేశ పెడుతున్నామన్నారు. అది కూడా ఓర్వలేక బీఆర్ఎస్ పథకం అమలుకు అడ్డు తగిలేందుకు విశ్వ ప్రయత్నం చేస్తుందన్నారు. అలాగే పదేళ్లు అప్పులు మిగిల్చి, ఇప్పుడు కాంగ్రెస్ సుపరిపాలన అందించడం ఏమాత్రం బీఆర్ఎస్ కు రుచించడం లేదని భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ రూల్స్ బుక్ పై భట్టి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ రూల్స్ బుక్ ను ఇష్టారీతిన మార్చిందని, ఆ రూల్స్ ఇప్పటికీ అమలవుతున్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అసెంబ్లీలో ప్లకార్డులు ప్రదర్శించరాదని రూల్స్ మార్చారని, కానీ ఇప్పుడు మాత్రం బీఆర్ఎస్ రూల్స్ పాటించడం లేదన్నారు. నాడు మీ స్వార్థం కోసం ఎన్ని మార్పులైనా చేస్తారు, నేడు ప్రభుత్వం మారితే అవి పాటించరా అంటూ భట్టి ప్రశ్నించారు.

# అవినీతి ఆరోపణలపై కూడా చర్చకు రెడీ

మొదటి పేజీ తరువాయి

బెదిరిస్తున్నారని అన్నారు. కొడంగల్ రైతులు కూడా రేవంత్ రెడ్డికి ఓటేశామని బాధపడుతున్నారని కేటీఆర్ అన్నారు. పట్నం నరేందర్ రెడ్డి, లగచర్ల రైతులను అరెస్టు చేసి 35 రోజులైందని తెలిపారు. నాంపల్లి కోర్టులో లగచర్ల రైతులు, పట్నం నరేందర్ రెడ్డి కేసులపై వాదనలు ముగిశాయని చెప్పారు. మనకు అనుకూలంగా తీర్పు రాకుంటే హైకోర్టు, సుప్రీంకోర్టుకు కూడా వెళదామని స్పష్టం చేశారు. లగచర్ల రైతులకు న్యాయం జరిగేవరకు సర్కార్‌ను వదిలిపెట్టమని హెచ్చరించారు. కొడంగల్‌లో రేవంత్ రెడ్డిని తుక్కుతుక్కుగా ఓడిరచే సత్తా పట్నం నరేందర్ రెడ్డికి ఉందని కేటీఆర్ తెలిపారు. నరేందర్ రెడ్డి గుండె ధైర్యానికి సెల్యూట్ చేయాలని అన్నారు. రేవంత్ రెడ్డి ఏడాది కింద రాష్ట్రమంతటా తిరిగి దొంగ హామీలు ఇచ్చారని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలపై చర్చకు ఎక్కడికైనా సిద్ధమని స్పష్టం చేశారు. రూ.2లక్షల రైతు రుణమాఫీ ఎక్కడైనా పూర్తయ్యిందా అని ప్రశ్నించారు. దీనిపై చర్చకు వస్తారా అని సవాలు విసిరారు. ఒక్క ఊళ్లో అయినా వంద శాతం రైతు రుణమాఫీ చేసినట్లు చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని తెలిపారు. ఏడాది కడుపు కట్టుకుంటే 49 కోట్లు మాఫీ చేస్తామని రేవంత్ బీరాలు పలికారని అన్నారు. కానీ ఇప్పటివరకు రైతుల ఖాతాలో 13 కోట్లకు మించి పడలేదని చెప్పారు. వానాకాలంలో రైతుభరోసాను ఎగ్గొట్టిండని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఇచ్చిన రూ.10వేల రైతుబంధు కూడా ఇవ్వడం లేదని అన్నారు. రాహుల్ గాంధీ నుంచి మొదలుపెడితే కాంగ్రెస్ నేతలు చెప్పినవన్నీ అబద్ధాలే అని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓటేసినందుకు ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దించేందుకు ఏదైనా ఉపాయం ఉందా అని ప్రజలంతా అడుగుతున్నారని తెలిపారు. నీలి రంగు నక్కను ఎప్పుడు వదిలించుకుందామా అని తెలంగాణ సమాజం ఎదురుచూస్తోందని తెలిపారు. రోషం ఉన్నవాడైతే ప్రజల తిట్లకు రేవంత్ రెడ్డి ఎప్పుడో చచ్చిపోతుండే అని ఎద్దేవా చేశారు.

# ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ ఆలయంలో పోటెత్తిన భక్తులు



ధర్మపురి, డిసెంబర్ 17 (మన బలగం): ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆల యంలో మంగళ వారం తెల్లవారు జామున భక్త జనంతో కిటకిటలాడింది. సోమవారం వైభ వంగా ప్రారంభమైన ధనుర్మాస ఉత్సవాల నేపథ్యంలో భక్తజనం స్వామి వారి పూజా ది కార్యక్రమాలు కనులారా తిలకించ డానికి ఆలయానికి తరలివచ్చారు. రాష్ట్ర నలుమూల నుంచి భక్తులు భక్తిశ్రద్ధలతో నెలరోజుల పాటు కొనసాగే ధనుర్మాస పూజాది కార్యక్రమాలలో ఇదే తరహాలో భక్తజనం రద్దీ కొనసాగుతుంది. మొద టగా గోదావరి స్నానం ఆచరించి దేవా లయంలో దర్శనం చేసుకుని తీర్థ ప్రసా దాలు స్వీకరించి వెళ్తారు. అర్చకులు, వేద పండితుల వేద పఠనం, మంగళ వాయి ద్యాలు, అర్చకులు శ్రీ స్వామివారికి పం చోపనిషత్తతో అభిషేకం, స్వామివారికి నా గ, పంచ, కలశ పలు రకాల హారతులు, మంత్రపుష్పం, భజన కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

# పెన్షనర్ల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



నిర్మల్, డిసెంబర్ 17 (మన బలగం): పెన్షనర్ల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహించిన జాతీయ పెన్షనర్ల దినోత్సవంలో ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొన్నారు. ముందుగా కార్యక్రమానికి హాజరైన జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి రాధిక, డీటీవో సరోజలతో కలిసి కలెక్టర్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పెన్షనర్ల హక్కులు, సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. నేటి జాతీయ పెన్షనర్ల దినోత్సవ కార్యక్రమానికి హాజరైన పెన్షనర్లందరికి పెన్షనర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజు మీరు అందించిన సేవలను గౌరవించుకోవడం, అనుభవాలను పంచుకోవడం కోసం ప్రత్యేకమైన రోజు అని తెలిపారు. మీరు చేసిన కృషి, నిబద్ధత, అంకితభావం ఫలితంగానే సమాజం ఈ స్థాయికి చేరుకుందని అన్నారు. జిల్లాకు ఎన్నో సంవత్సరాలుగా మీరు చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. సీనియర్ సిటిజన్ యాక్ట్ ద్వారా హక్కులు, రక్షణను పొందవచ్చు అని తెలిపారు. సంక్షేమ వసతి గృహాలను సందర్శించి విద్యార్థులకు మీ అనుభవాలను వివరిస్తూ వారిని ప్రయోజకులుగా తీర్చిద్దేలా మీ విలువైన సలహాలు, సూచనలు అందించాలని కోరారు. మీ హక్కుల రక్షణ, సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఈ సందర్భంగా కలెక్టర్ హామీ ఇచ్చారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి మాట్లాడుతూ, నేడు దేశవ్యాప్తంగా జాతీయ పెన్షనర్ల దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రతి రిటైర్డ్ ఉద్యోగి పెన్షన్ తీసుకోవడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని పెన్షన్ ఆర్థిక భద్రతనే కాకుండా జీవితానికి గౌరవాన్ని కలిగించేదని అన్నారు. నేటి సమాజంలో వయోవృద్ధులకు ఎదురైతున్న సమస్యల పరిష్కారానికి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ తరపున చర్యలు తీసుకుంటామని తెలిపారు. మీ విలువైన సలహాలు, జీవితానుభవాలతో నేటి తరానికి మార్గ నిర్దేశం చేయాలని కోరారు.

అంతకుముందు పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఎంసీ లింగన్న మాట్లాడుతూ, పెన్షనర్ల సంఘ భవనం కాంపౌండ్ వాల్ నిర్మాణానికి 5 లక్షలు జిల్లా కలెక్టర్ మంజూరు చేశారని తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్ల సంక్షేమానికి పడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం మున్సిపల్ కార్మికులను, విశ్రాంత ఉద్యోగులను కలెక్టర్, అధికారులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో రత్న కళ్యాణి, ఎస్టీవో రమేశ్, తహసీల్దార్ రాజు, సంఘం ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సార్లూ.. నేలకొరుగుతున్నా..

# నన్ను నిలబెట్టండి!



జగిత్యాల, డిసెంబర్ 17 (మన బలగం): ఇంటింటికీ విద్యుత్ వెలుగులను పంచేందుకు వీధి పోలుగా నన్ను నిలిపారు. నేను అనేక ఇళ్లకు వెలుగులు పంచుతున్నాను. కానీ నాపై భారం పెరుగుతూపోతోంది. నాకు ఇరు వైపులా సమానంగా మెయిన్ విద్యుత్ వైర్లు లేకపోవడంతో ఒక వైపు వాలిపోతున్నాను. రోజు రోజుకూ విద్యుత్ కనెక్షన్ వైర్లు పెరుగుతున్నాయి. వీటి బరువుతో ఎప్పుడు నేల వాలుతానో తెలియడంలేదు. ఇన్నాళ్లు ఆ ప్రాంత ప్రజలకు నిఖార్సైన సేవలను అందించాను. విద్యుత్ సార్లూ.. ఇప్పటికైనా మేల్కొంటే మంచిది. వంగిపోతున్న నన్ను నిలబెడితే మరికొంత కాలం ఈ ప్రాంతానికి సేవలు అందిస్తా. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని ఈ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అనుకోని విపత్తు తలెత్తకముందే విద్యుత్తు అధికారులు స్పందిస్తారని వేడుకొంటున్నా..!

ఓ వీధి పోలు
టీపీ 2/1/2
24 వార్డు, వాణి నగర్, జగిత్యాల.



## వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ధర్మారం, డిసెంబర్ 17 (మన బలగం): పెద్దపెల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో మంగళవారం కొలుముల దామోదర్ యాదవ్ (ఎన్నారై కెనడా) సౌజన్యంతో వృద్ధులు, మహిళలకు ఉచితంగా దుప్పట్లు (రగ్గులు) పంపిణీ చేసార. కార్యక్రమానికి ధర్మపురి శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సతీమణి కాంత కుమారి, ధర్మారం మార్కెట్ కమిటీ చైర్మన్ రూప్లనాయక్, ధర్మారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, దేవి జనార్దన్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఇన్‌చార్జి వేల్పుల నాగరాజు, జంగా మహేందర్, తుమ్మల తిరుపతి దేవి, లావణ్య, తుమ్మల రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## దూళిమిట్ట ఉన్నత పాఠశాలలో

# బాలసాహిత్యంపై కార్యశాల




మనబలగం, సిద్దిపేట ప్రతినిధి: సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలసాహిత్యంపై కార్యశాల నిర్వహించారు. శ్రీవాణి సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో సిద్దిపేట పెందోట బాల సాహిత్యం సౌజన్యంతో ఏర్పాటు చేసిన 'బాల సాహిత్య కార్యాశాల'కు ప్రముఖ బాల సాహిత్య కవి, గేయ రచయిత పెందోట వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థినీ, విద్యార్థులకు బాల సాహిత్యంపై అవగాహన కల్పించడంతో పాటు కవితలు, గేయాలు, కథలు రాయడంలో మెళకువలు నేర్పించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థుల చేత అప్పటికప్పుడు కవితలు, కథలు రాయించి వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. బాల సాహిత్య కార్యశాల అనంతరం కవి, రచయిత పెందోట వెంకటేశ్వర్లు రచించిన 'భలే భలే ఆటలు' అనే నూతన పుస్తక సంకలనాన్ని ఆవిష్కరించారు. తెలుగు భాషా ఉపాధ్యాయులు గొట్టిపర్తి భాస్కర్ 'భలే భలే ఆటలు' పుస్తకాన్ని సమీక్షిస్తూ విద్యార్థినీ, విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ పెందోట వెంకటేశ్వర్లు ఉపాధ్యాయుడిగానే కాకుండా పిల్లల పట్ల తనకున్న మక్కువతో శ్రీవాణి సాహిత్య పరిషత్ లాంటి సాహితీ సంస్థను స్థాపించడం అభినందనీయమని పేర్కొన్నారు. పిల్లలకు బాల సాహిత్యంతో పాటు తెలుగు భాషలోని వివిధ ప్రక్రియలను నేర్పిస్తూ, ఆయా పాఠశాలల పిల్లలను బాలసాహిత్యం వైపు ప్రోత్సహిస్తూ వారు రాసినటువంటి కవితలను పుస్తక రూపంలో అచ్చు వేయించడం స్ఫూర్తిని కలిగిస్తుందన్నారు. పిల్లల చేతుల మీదుగా ఆవిష్కరణలు చేయించడం, ఇలా తను రచించిన బాల సాహిత్య పుస్తకాలను పాఠశాలల లైబ్రరీకి అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కరుణాకర్ రెడ్డి, ప్రముఖ కవి, రచయిత పెందోట వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు చిలుక వెంకటయ్య, మానుక శ్రీనివాస్, వంగ శ్రీనివాస్ రెడ్డి, ఇర్రి రాజిరెడ్డి, గొట్టిపర్తి భాస్కర్, నాగులపల్లి రాములు, నిమ్మ సురేందర్ రెడ్డి, పిడిశెట్టి నరేశ్, సుద్దాల రంజిత్ కుమార్, యామ రాజు, ఉపాధ్యాయినులు కె.సమత, సందిటి సులోచన పాల్గొన్నారు.

## ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన



ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 17 (మన బలగం): జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ గ్రామంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్, మాడేకర్ చారిటబుల్ ఐ హాస్పిటల్ రేకుర్తి చైర్మన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సురేశ్ సహకారంతో శిబిరం ఏర్పాటు చేసారు. క్లబ్ అధ్యక్షుడు శాంత భూషణ్, రేకుర్తి వైద్యులు డాక్టర్ ప్రభాకర్ శిబిరాన్ని ప్రారంభించారు. రేకుర్తి వైద్యులు ప్రభాకర్ 90 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 26 మందిని ఆపరేషన్ కోసం ప్రత్యేక బస్సులో రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ బోనగిరి భూమేశ్, మాజీ అధ్యక్షులు నెమురి సత్యానారాయణ, ఏలేటి చిన్నారెడ్డి, సభ్యులు, రెబ్బాటి రాజశేఖర్, దొంతుల తుక్కారం, పొనకంటి వెంకట్, గుజ్జేరి గణేశ్, మంగలిపల్లి లక్ష్మణ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మల్లన్న స్వామి ఆలయంలో కాంగ్రెస్ నాయకుల పూజలు

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 17 (మన బలగం): జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు బిర్కుల మల్లన్న స్వామిని దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నేరెళ్ళ దేవేందర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ లింగపెళ్ళి గంగాధర్, మాజీ ఎంపీటీసీ దేశెట్టి శాంతి జీవన్, మాజీ ఉప సర్పంచ్ రాజేశ్వర్, నాయకులు జనా శంకర్, దుద్దుల లింగన్న, రాదే రాజారెడ్డి, తెలు రమేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

**జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**




నిర్మల్, డిసెంబర్ 17 (మన బలగం): గ్రామీణ స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి క్రీడాకారులు ఎదగడానికి సీఎం కప్ తోడ్పడుతుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. మంగళవారం నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రారంభించిన బ్యాడ్మింటన్ క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ స్థాయి నుంచి క్రీడాకారులు జాతీయ స్థాయి వెళ్లేలా సీఎం కప్ క్రీడా పోటీలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. యువత చదువుతోపాటు క్రీడలలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ క్రీడామైదానంలో రెండో రోజు క్రీడా పోటీలను జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. బాక్సింగ్, హ్యాండ్ బాల్, నెట్ బాల్, చెస్, తైక్వాండో, కారాటే, ఆట్యా పాట్యా, ఎన్ఎస్ఏ అకాడమీలో బ్యాడ్మింటన్ క్రీడలు నిర్వహించారు. ఇందులో జిల్లా వ్యాప్తంగా దాదాపు 800 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ కన్వీనర్ శ్రీధర్ రెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ రవీందర్ గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి భోజన్న, వ్యాయామ ఉపాధ్యాయులు భూమన్న, బుచ్చి రామారావు, రమణారావు, స్వామి, భూమేష్, జమున, విజయలక్ష్మి, రాజేందర్ ,కవిత, సంజీవ్, సాయిరాజ్ ముఖేశ్ తదితరులు, పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ



ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 17 (మన బలగం): జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో మంగళవారం ఉదయం అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన పుస్తెం మహేందర్ కన్నెస్వామి ఇంట్లో సౌడల వినోద్ గురుస్వామి కరకమములచే గణపతి, సుబ్రహ్మణ్యం కలిశ, గంట, అయ్యప్ప స్వామి అభిషేకాలు,అయ్యప్ప స్వామి అష్టోత్తర, స్వామి వారి 18 మెట్ల పూజ కార్యక్రమం, అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి దీక్షాపరుల భజన సంకీర్తనలు అలరించాయి. పూజా కార్యక్రమం అనంతరం స్వామివారికి ఎంతో ఇష్టమైన వేటతుల్లి ఆట ఆడారు. పూజా కార్యక్రమం అనంతరం గురు సన్మానం జరిగింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్, తెలంగాణ జనసమితి పార్టీ ఇన్‌చార్జి కంతి మోహన్ రెడ్డి, భారతీయ జనతపార్టీ రాష్ట్ర నాయకులు సురభి నవీన్ కుమార్, బీజేపీ మండల అధ్యక్షులు బాయి లింగారెడ్డి, తీగల శ్రీధర్ రెడ్డి, సమరావు గురుస్వామి, రమేశ్ గురుస్వామి, ఆనంద్, రంజిత్, రాజేందర్, గూడ సొల్లు ముత్యం రెడ్డి, బెల్లాల రమేశ్ గురుస్వామి, నల్లరామ రాజు గురుస్వామి, సతీశ్ గురు స్వామి, జోగయ్య గురు స్వామి, లింగారెడ్డి గురు స్వామి, వాల్గోట్ నరేశ్ పాల్గొన్నారు.



## మల్లన్న స్వామిని దర్శించుకున్న ఏఎంసీ చైర్మన్

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 17 (మన బలగం): జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బ గ్రామంలో మంగళవారం మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వీడీసీ సభ్యులు చైర్మన్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా యూత్ కాంగ్రెస్ మీడియా కో–ఆర్డినేటర్ కూన రాకేశ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు నల్లూరి సాగర్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ సెక్రటరీ అమ్ముల పవన్, నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ కార్యనిర్వాహక అధ్యక్షులు గద్దల భరత్ రాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాధే శ్రీనివాస్, బైండ్ల శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దం ప్రశాంత్, కానుక దినేశ్, సమీర్ సర్కార్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నివేదికలు ఇవ్వండి



**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

నిర్మల్, డిసెంబర్ 17 (మన బలగం): డబుల్ బెడ్రూం ఇండ్ల సమగ్ర నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలపై తహసీల్దార్లు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో చేపట్టిన రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణాలపై సమగ్ర నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలో మంజూరైన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, పరిపాలన అనుమతులు పొందినవి, పూర్తి అయినవి, ఇంకనూ నిర్మాణంలో ఉన్న వాటి పురోగతిపై సమగ్ర నివేదికలు అందించాలని సూచించారు. అలాగే ఇప్పటివరకు లబ్ధిదారులకు అందించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో విద్యుత్తు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండలాల వారీగా మంజూరై చేపట్టిన ఇండ్ల పురోగతిపై కలెక్టర్ చర్చించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీఓ రత్న కళ్యాణి, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## లగచర్ల రైతులపై కేసులు ఎత్తేయాలి



బుగ్గారం, డిసెంబర్ 17 (మన బలగం): లగచర్ల రైతులపై అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తేయాలని, వారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు నిరసన తెలిపారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల నాయకులు మాట్లాడుతూ లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, జైల్లలో నిర్బంధించడం సరికాదన్నారు. వెంటనే రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేసారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గాలిపెల్లి మహేశ్, రైతులు,పార్టీ శ్రేణులు, మాజీ ప్రజా ప్రతినిధులు, యువకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

# ప్రపంచం మీద డాలర్ పెత్తనం

అంతర్జాతీయ ఆర్థిక, ద్రవ్య వ్యవస్థ ద్వారా అన్ని దేశాలకూ సౌకర్యంగా ఉండే ఒక చెల్లింపుల విధానాన్ని రూపొందించుకుని ఆ ప్రాతిపదికన వాణిజ్యాన్ని కొనసాగించవచ్చని కొంత మంది ఆర్థికవేత్తలు భావిస్తారు. కాని వాస్తవం అందుకు పూర్తి భిన్నం. పశ్చిమ సామ్రాజ్యవాద దేశాల పెత్తనం మీద ఆధారపడి అంతర్జాతీయ వ్యవస్థ ఏర్పడింది. ఈ ఆర్థిక, ద్రవ్యవ్యవస్థ తిరిగి అదే సామ్రాజ్యవాదానికి అండగా నిలబడుతుంది. ఈ అంతర్జాతీయ వ్యవస్థకు ఇరుసు అమెరికన్ డాలర్. ఐతే, అంతర్జాతీయ వాణిజ్యంలో పాల్గొనే వివిధ దేశాల మధ్య పరస్పరం జరిగే వాణిజ్యానికి ఈ డాలర్ పెత్తనం ప్రతిబంధకంగా ఉంటోంది. ఉదాహరణకు, 1వ దేశానికి 'క' అనే సరుకు అవసరం అనుకోండి. అది 2వ దేశం తయారు చేస్తోంది. ఈ 2వ దేశానికి 'చ' అనే సరుకు అవసరం అను కోండి. దాన్ని 1వ దేశం తయారు చేస్తోంది. అప్పుడు ఈ రెండుదేశాలూ ఆ రెండు సరుకులనూ పరస్పరం మార్పిడి చేసుకోవచ్చు కదా. కాని ప్రస్తుత అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థ ప్రకారం అలా మార్పిడి చేసుకోడానికి వీల్లేదు. ఆ రెండు దేశాల వద్దా తమకు కావలసిన సరుకులను కొనుగోలు చేయడానికి సరిపడా డాలర్ నిల్వలు ఉండాలి. అలా లేకపోతే ఆ రెండు దేశాలూ తమ సరుకులను మార్పిడి చేసుకోలేవు. అంతర్జాతీయ వ్యాపారం యావత్తూ డాలర్ కరెన్సీతోనే సాగుతుంది. ఈ నిబంధన గనుక లేకపోతే చాలా దేశాలు తమ తమ సరుకులను తక్కిన దేశాలతో తేలికగా మార్చు కోవచ్చు. డాలర్ మీద ఆధారపడడం అనేది తగ్గితే అది అంతర్జాతీయ వాణిజ్యాన్ని సులభతరం చేస్తుంది. విధంగా డాలర్ మీద ఆధారపడటం తగ్గితే అది అమెరికాకు అంగీకారంగా ఉండదు. ప్రపంచమంతా డాలర్‌ను మారకపు సాధనంగా అంగీకరించడం, డాలర్ రూపంలో నిల్వఉంటే అది బంగారపు నిల్వతో సమానం అన్న అభిప్రాయం ప్రబలంగా ఉండడం అనేది అమెరికాకు చాలా పైచేయిని కల్పిస్తుంది. అమెరికా ఇప్పుడు ఎన్నటికీ తరగని ఒక బంగారపు గని మీద దర్జాగా కూర్చుని వుంది. ఇతర దేశాల నుండి తనకు కావలసిన వనరులను అది కొనుగోలు చేయవచ్చు, సంస్థలనే కొనుగోలు చేయవచ్చు, విదేశాలలో ఎంత కావాలంటే అంత పెట్టుబడి పెట్టవచ్చు. తన విదేశీ వ్యాపారంలో లోటుగనుక ఏర్పడితే దానిని పూడ్చుకోడానికి ఎన్ని డాలర్లు కావాలంటే అన్నింటిని ముద్రించుకోవచ్చు. అలా అపరిమితమైన కొనుగోలు శక్తిని అంతర్జాతీయ వాణిజ్య రంగంలో కలిగి వుండడమే కాదు. ఇతర దేశాల మెడలు వంచి అవి తన పెత్తనానికి లోబడి వుండేలా చేయడానికి కూడా డాలర్ పెత్తనం తోడ్పడుతుంది. ఆ యా దేశాల డాలర్ నిల్వలు సాధారణంగా పశ్చిమ దేశాల బ్యాంకుల్లోనే భద్రపరచడం జరుగుతుంది. అందుచేత అమెరికా తనకు నచ్చిన దేశానికి కావలసినంత మేరకు డాలర్ల ప్రవాహాన్ని పంపనూవచ్చు. తనకు నచ్చనప్పుడు ఆ దేశపు బ్యాంక్ అకౌంట్లను స్తంభింపజేసి డాలర్ల కొరతనూ సృష్టించవచ్చు. ఇరాన్ నుండి రష్యా వరకూ అనేక దేశాలు ఈ విధంగా శిక్షలు అనుభవిస్తున్నాయి. ఈ విధంగా వివిధ దేశాల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడం ఈ మధ్య కాలంలో మరీ ఎక్కువైంది. దాంతో డాలర్ ప్రమేయంలేని వ్యాపారం కావాలన్న డిమాండ్ ఆ డాలర్ల కొరతను ఎదుర్కొంటున్న దేశాల నుండి పెరుగుతోంది.

ప్రస్తుతం దాదాపు మూడోవంతు ప్రపంచ దేశాలు అమెరికా నుండి ఇటువంటి శిక్షలను ఎదుర్కొంటున్నాయి. అయితే ఆ విధంగా శిక్షించడానికి ఐరాస నుండి అమెరికాకు ఎటువంటి అనుమతీ లేదు. దక్షిణాఫ్రికా దేశం జాతి వివక్షతను పాటించిన కాలంలో అంతర్జాతీయ సమాజం ఆదేశాన్ని శిక్షించడానికి ఆమోదం ఇచ్చింది. అటువంటి సందర్భాలేవీ లేకపోయినా అమెరికా తన పెత్తనాన్ని చెలాయిస్తూ తనకు లొంగని దేశాల ఖాతాలను స్తంభింపజేస్తూ వాటిని ఇబ్బందులపాలు చేస్తోంది. వాటిలో మూడవ ప్రపంచ దేశాలు ఎక్కువగా



ఉన్నాయి. అమెరికా కన్నెర్రకు గురైన దేశాలు ఇప్పుడు డాలర్ ప్రమేయం లేని అంతర్జాతీయ వాణిజ్యం కావాలని కోరుకుంటున్నాయి. ఇటీవల

కజన్‌లో జరిగిన 'బ్రిక్స్' దేశాల శిఖరాగ్ర సమావేశంలో ఈ ఆకాంక్ష బలంగా వ్యక్తమైంది. మా పెత్తనం వల్లే ఇటువంటి ఆకాంక్షలు తలెత్తుతున్నాయని అమెరికన్ ప్రభుత్వం సైతం గుర్తించింది. అమెరికన్ ఆర్థిక శాఖ మంత్రి జేనెట్ జులైలో జరిగిన ఆర్థిక వ్యవహారాల కమిటీ సమావేశంలో మాట్లాడుతూ 'అమెరికా ఆంక్షలు ఎన్ని ఎక్కువ దేశాల మీద విధిస్తే అన్ని ఎక్కువ దేశాలు అమెరికన్ డాలర్ ప్రమేయం లేని వ్యాపారం కావాలని కోరుకుంటాయి.' అన్నారు. తన అడుగులకు మడుగులొత్తేలా ఒత్తిడి చేయడానికి అమెరికా ఆంక్షల బెదిరింపును వాడుకుంటోందని చెప్పకనే చెప్పారు. అలా బెదిరింపులలకు బలౌతున్న దేశాల సంఖ్య పెరుగుతున్న సంగతినీ అంగీకరించారు. అలా ఏకపక్షంగా ఆంక్షలు విధించడం ద్వారా పెత్తనాన్ని చెలాయించేందుకు పూనుకోవడం వలన పరస్పర విరుద్ధ ఫలితాలు వస్తాయి. ఒకటో, రెండో దేశాల మీద ఆంక్షలు విధిస్తే అప్పుడు వాటి ప్రభావమూ గట్టిగా ఉంటుంది, ఆ ఆంక్షలు మొత్తం వ్యవస్థకూ ముప్పు తెచ్చిపెట్టవు. అదే అనేక దేశాల మీద ఆంక్షలు విధిస్తే అప్పుడు మొత్తం వ్యవస్థకే ముప్పు వాటిల్లుతుంది. నయా ఉదారవాద విధానాల ఫలితంగా పేదరికంలోకి దిగజారిపోతున్న దేశాల సంఖ్య పెరుగుతోంది. అందుచేత ఎదురు తిరిగే దేశాల సంఖ్య రానున్న కాలంలో ఇంకా పెరిగే అవకాశా లున్నాయి. వాటి మీద ఆంక్షలూ పెరుగుతాయి. అప్పుడు ఈ డాలర్ పెత్తనమే వద్దనే దేశాల సంఖ్యా పెరుగుతుంది. డాలర్‌ను అంతర్జాతీయ మారకపు సాధనంగా ఉపయోగించడం వలన అమెరికా దానిని అడ్డం పెట్టుకుని వివిధ దేశాల మెడలు వంచి వాటిపై తన పెత్తనాన్ని చెలాయించడం వల్లనే ఇలా జరుగుతోంది. అందుచేత డాలర్ మారకపు కరెన్సీగా ఉండడం అనేది అంతర్జాతీయ వాణిజ్యంలో అన్ని దేశాలకూ ప్రయోజనకరంగా ఉంటుందని ఉదారవాద ఆర్థికవేత్తలు చెప్తున్నది ఎంత డొల్ల వాదనో స్పష్టంగా తేలుతోంది.

డాలర్ ఈ విధంగా పెత్తనం చెలాయించగలగడానికి ఒక కారణం 1970 దశకంలో అమెరికాకు, చమురు ఉత్పత్తి దేశాలకు నడుమ కుదిరిన ఒప్పందం. ఆ ఒప్పందాన్ని సౌదీ అరేబియా మధ్యవర్తిత్వంతో కుదుర్చుకున్నారు. దాని ప్రకారం అంతర్జాతీయంగా ముడిచమురు ధరలను డాలర్‌లనో నిర్ణయిస్తారు. ఆ డాలర్లలోనే ఆ చమురు వ్యాపారం సాగుతుంది. చమురుకు ఉన్న ప్రాధాన్యత రీత్యా ఈ ఒప్పందం తర్వాత డాలర్ ప్రాధాన్యత ఒక్కసారి పెరిగింది. ముడిచమురుకు ఇటువంటి ప్రాధాన్యత ఉంది కనుకనే ఇటీవల పశ్చిమ దేశాలు రష్యాపై ఆంక్షలు విధిం చాక వాటి నుండి తట్టుకోడానికి రష్యా తన ముడిచమురు కొనుగోలు చేసేవారు రూబుళ్లలోనే చెల్లింపులు చేయాలని నిబంధన విధించింది. అయితే, 1970 దశకంలో కుదిరిన ఆ ఒప్పందం ఒక్కటే డాలర్ ఆధిపత్యం నేటికీ కొనసాగడానికి కారణం కాబోదు. డాలర్ ప్రమేయం లేకుండా అంతర్జాతీయ వ్యాపారం జరగాలన్న భావననే జేనెట్ మొదట్లో తేలికగా కొట్టిపారేశారు. కాని ఇప్పుడు ఆమె ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవలసి వస్తోంది. ఇప్పుడు ట్రంప్ డాలర్ పెత్తనాన్ని కాదనుకుంటున్న దేశాలను బెదిరించడానికి పూనుకుంటున్నాడు. అమెరికాకు ఆ దేశాలు ఎగుమతి చేసే సరుకులపై సుంకాన్ని వందశాతం పెంచుతానంటూ రంకెలు వేస్తున్నాడు. అంటే డాలర్ పెత్తనం ఎలాగైనా కొనసాగడానికి అమెరికన్ సామ్రాజ్యవాదం తన శక్తిని వినియోగిస్తోందన్నమాట. ఇటువంటి బెదిరింపుల ప్రభావం బలంగానే ఉంటుంది. ఎందుకంటే డాలర్ ప్రమేయం లేకుండా వ్యాపారం చేసుకోవడం అనేది ఒక్క పట్టున సాధ్యపడేది కాదు.

ఈలోపున అమెరికాకు ఆ దేశాలు చేసే ఎగుమతులు కుదించుకు పోతే అప్పుడు ఆ దేశాల దగ్గరుండే డాలర్ నిల్వలు మరీ వేగంగా హరించుకుపోతాయి. అప్పుడు ఆ దేశాలు మరింతగా ఇబ్బందుల పాలౌతాయి. తమ దేశీయ అవసరాలకు కావలసిన దిగుమతులను అవి డాలర్ ప్రమేయం లేని వ్యాపారం ద్వారా పొందవచ్చు. కాని ఇప్పటికే ఆ దేశాలు ఐ.ఎం.ఎఫ్, లేదా ప్రపంచబ్యాంక్ దగ్గర రుణాలు పొంది వుంటే ఆ రుణాలకు చెల్లించవలసిన వాయిదాలు డాలర్ల

రూపంలోనే చెల్లించాలి. ఆ డాలర్ల నిల్వలు హరించుకుపోతే అప్పుడు ఆ దేశాలు రుణ ఎగవేతదారులుగా నిలబడవలసి వస్తుంది. దానివలన కొత్త షరతులను భరించవలసి వస్తుంది. అందుచేత ట్రంప్ ప్రకటిస్తున్న హెచ్చరికలను సీరియస్‌గానే తీసుకోవాలి. ఉదారవాద ఆర్థికవేత్తలు ఎంతో సౌమ్యంగా చిత్రించే సామ్రాజ్యవాదపు ఆధిపత్య రూపం కాస్తా ఇప్పుడీ ట్రంప్ బెదిరింపులతో పూర్తిగా బయటపడి పోయింది! అయితే ఈ బెదిరింపులను ఎదుర్కొనే దేశాలు డాలర్ పెత్తనం నుండి బయటపడవలసిన అవసరాన్ని మరింతగా గుర్తించడానికే ఈ బెదిరింపులు తోడ్పడతాయి. డాలర్-రహిత అంతర్జాతీయ వ్యాపారం పుంజుకోడానికి ఇంకా చాలా సమయం పడుతుంది. ఈ సంగతి కజన్ శిఖరాగ్ర సమావేశానికీ తెలుసు. ట్రంప్ బెదిరించగానే భారత దేశంతో సహా పలు దేశాలు తమకు ఈ డాలర్-రహిత వాణిజ్యం పట్ల ఆసక్తి లేదంటూ ప్రకటించాయి. అమెరికా దృష్టిలో

బుద్ధిమంతులని పించుకోడానికి ఈ ప్రకటనలు ఉపయోగపడవచ్చు. కాని అమెరికా పెత్తనానికి సవాలు తీవ్రంగానే ఎదురవుతోందన్నది మాత్రం వాస్తవం. తమ దేశాల ఆధిపత్యానికి సవాలు తీవ్రంగా ఎదురవుతోందన్న వాస్తవాన్ని గుర్తించిన పశ్చిమ సామ్రాజ్యవాద దేశాల ప్రభుత్వాలే కాకుండా ఆ దేశాల్లోని సోషల్ డెమాక్రటిక్ పార్టీలు సైతం ఉక్రెయిన్ విషయంలో గాని, గాజా విషయంలో గాని మరింత ఐక్యంగా వ్యవహరిస్తున్నాయి. అయితే డాలర్‌కు ప్రత్యామ్నాయంగా ఏ విధమైన అంతర్జాతీయ వ్యవస్థను ఏర్పరచాలన్న విషయం మీద ఇంకా బ్రిక్స్ దేశాల నడుమ ఒక స్పష్టత రాలేదు. ఇలా ఏర్పడే ఆ ప్రత్యామ్నాయ వ్యవస్థ డాలర్‌కు బదులు మరొక దేశపు కరెన్సీకి ఆధిపత్యాన్ని కట్టబెట్టేదిగా మాత్రం ఉండకూడదు. అలా జరగాలంటే ఇప్పుడు ఏ సూత్రాల ప్రాతిపదికపై అంతర్జాతీయ వాణిజ్యం సాగుతోందో ఆ సూత్రాలే, ఆ నియమాలే మారిపోవాలి. అంతే కాదు. అంతర్జాతీయ వాణిజ్యంలో వాణిజ్యలోటు పెరుగుతున్న దేశాల మీద ఆ లోటును భర్తీ చేసే భారాన్ని మోపే పద్ధతి కూడా మారాలి.

# కేటీఆర్ మెడకు ఫార్ములా ఈ-రేస్!



సోమవారం తెలంగాణ కేబినెట్ సమావేశం ముగిసిన తరువాత మంత్రి పొంగులేటి మీడియా చిట్ చాట్‌లో ఆసక్తికరమైన వ్యాఖ్య చేశారు. తెలంగాణలో ఏ బాంబు పేలుతుందో త్వరలో కేటీఆర్‌కు తెలుస్తుందని అనటం. దీని ద్వారా కేటీఆర్ అరెస్టు తప్పదని చెప్పకనే చెప్పారాయన. మరోవైపు, తనను ఎప్పుడు అరెస్టు చేస్తారా అని ఎదురుచూస్తున్నట్టుగా ఉంది కేటీఆర్ స్పందన. అరెస్టు చేసుకుంటే చేసుకోండి.. జైల్లో యోగా చేసుకుంటా.. తర్వాత వచ్చి పాదయాత్ర చేసుకుంటా అని. ఈ మధ్య కాలంలో జైలుకు వెళ్లిన వారంతా సీఎంలు అవుతున్నారనే సెంటిమెంట్ తనకు కూడా పని చేస్తుందని కేటీఆర్ అనుకుంటున్నారేమో తెలియదు. కానీ, ఆయన అరెస్టుకు దారితీస్తున్న ఫార్ములా ఈ-రేస్‌కు సంబంధించిన కేసుతో ఇప్పుడు తెలంగాణ రాజకీయాలు హాట్ హాట్‌గా సాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పోరాడుతుండగా అదే స్థాయిలో అధికార పార్టీ వైపు నుంచి రీసౌండ్ వస్తోంది. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చోటు చేసుకున్న అక్రమాలపై విచారణ జరుపుతామని పదే పదే చెబుతున్న కాంగ్రెస్ సర్కార్.. ఆ దిశగానే అడుగులు వేస్తోంది. ఇప్పటికే చాలా విషయాలపై ఏసీబీ విచారణ జరుగుతోంది. ఇందులో ఒకటిగా హైదరాబాద్ ఫార్ములా ఈరేసు కూడా ఒకటి. ఈ వ్యవహారం ఇప్పుడు కేటీఆర్ మెడకు చుట్టుకుంది.

ఫార్ములా ఈ కార్ల రేస్ కేసులో కేటీఆర్‌ను విచారించేందుకు సర్వం సిద్ధమైంది. ఆయనను ప్రాసిక్యూషన్ చేసేందుకు ఏసీబీకి అనుమతిస్తూ గవర్నర్ ఇచ్చిన లేఖపై సోమవారం కేబినెట్ బేటీలో సుదీర్ఘంగా చర్చ జరిగింది. సీఎం రేవంత్ ఈ సమావేశంలో ఎంక్వైరీపై నిర్ణయం తీసుకు న్నారు. ఆ వెంటనే సీఎస్ శాంతికుమారి.. గవర్నర్ నుంచి వచ్చిన పర్మిషన్ లెటర్ ను ఏసీబీకి అందజేశారు. దీంతో ఒకటి, రెండు రోజుల్లోనే కేటీఆర్‌ను ఏసీబీ విచారణకు పిలిచే

అవకాశం కనిపిస్తోంది. ఈ కేసులో కేటీఆర్ పాత్రపై పక్కా ఆధారాలను సేకరించిన ఏసీబీ.. ఆయనను ఎంక్వైరీకి పిలవాలని ఇప్పటికే భావించింది. కానీ, కేటీఆర్ ఎమ్మెల్యే కావడంతో విచారణకు అనుమతించాలని ప్రభుత్వానికి లేఖ రాసింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ అనుమతి కోరింది. న్యాయ సలహా తీసుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ.. కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు ఇటీవలే అనుమతి ఇచ్చారు. తాజాగా అనుమతి లేఖ కూడా అందడంతో కేటీఆర్‌ను ఎంక్వైరీకి పిలిచేందుకు ఏసీబీ ఏర్పాట్లు చేసుకుంటోంది. ఇప్పటికే ఆయన పాత్రకు సంబంధించిన ఆధారాలను సేకరించిన ఏసీబీ అధికారులు.. విచారణ సందర్భంగానే అదుపులోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన సీజన్ 9 ఫార్ములా ఈ కార్ల రేస్తో పాటు నిర్వహించాలని భావించిన సీజన్ 10 ఫార్ములా ఈ-రేస్‌కు నాటి రాష్ట్ర కేబినెట్‌తో పాటు నాటి సీఎం ఆమోదం లేదు. సీజన్ 9 నిర్వహణకు రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కోసం హెచ్ఎండీఏ రూ.20 కోట్లు ఖర్చు చేసింది. స్టాల్స్, ప్రచారం, సీటింగ్, వీధిదీపాల లాంటి వాటికోసం 'నెక్స్ జెన్ గ్రీన్ కో' అనే ప్రైవేటు సంస్థ రూ.150 కోట్లు ఖర్చు చేసింది. ఇంకో రూ.30 కోట్లను 'హైదరాబాద్ రేసింగ్ లిమిటెడ్' ఖర్చు పెట్టింది. సీజన్ 9లో నాటి రాష్ట్ర ప్రభుత్వం, గ్రీన్ కో (నెక్స్ జెన్), ఫార్ములా ఈ (ఎఫ్ఈఓ) ఉన్నాయి. ఈ సీజన్‌లో నాటి రాష్ట్ర ప్రభుత్వం/ హెచ్ఎండీఏ కేవలం ఫెసిలిటేటర్‌గానే ఉంది. ఫెసిలిటేటర్‌గా ఉన్న ప్రభుత్వ పాత్ర.. కేవలం ఏర్పాట్లకు సహకరించడం

మాత్రమే! లాభనష్టాలతో సర్కారుకు ఎలాంటి సంబంధం లేదు. ఫార్ములా ఈ-రేస్‌ను ప్రమోట్ చేసిన గ్రీన్ కోకు సీజన్ 9లో చాలా నష్టం వచ్చింది. దీంతో ప్రైవేట్ ప్రమోటర్ గా ఉన్న గ్రీన్ కోను సీజన్ 10 నుంచి తప్పించి ఫార్ములా ఈ(ఎఫ్ఈఓ)తో ఒప్పందం చేసుకున్నారు. ఇక సీజన్ 10కు సంబంధించి ఫార్ములా -ఈ రేస్ అగ్రిమెంట్‌కు ముందే అదీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో అక్టోబర్ 2023న రూ.55 కోట్లు హెచ్ఎండీఏ చెల్లించింది. అది కూడా విదేశాల్లో ఉన్న కంపెనీకి ఆర్బీఐతో పాటు ఇతరత్రా ఎలాంటి పర్మిషన్లు లేకుండానే చెల్లింపులు చేశారు. ఏదైనా ప్రైవేట్ ఏజెన్సీ లేదా కంపెనీలతో ఇలాంటి ఈవెంట్లు నిర్వహించేముందు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవాలి. కానీ, సీజన్? 10 విషయంలో ఒప్పందం కంటే ముందే ఫండ్స్ చెల్లించే శారు. నిధులు పంపిన 18 రోజులకు అదీ ఎన్నికల కోడ్ సమయంలో ఒప్పందం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఈసీ నుంచి ఎలాంటి పర్మిషన్లు తీసుకోలేదు. ఈ ఒప్పందం వల్ల హెచ్ఎండీఏ (రాష్ట్ర ప్రభుత్వం)పై రూ.200 కోట్ల భారం పడింది. న్యాయ వివాదాలు వస్తే లండన్ కోర్టులో తేల్చుకోవాలనే నిబంధన ఉంది. ఎఫ్ఈఓ (ఫార్ములా-ఈ) వ్యక్తులెవరూ సెక్రెటేరియెట్‌కు రాలేదు. ముఖాముఖి చర్చలు కూడా జరగలేదు. చర్చలన్నీ ఈ-మెయిల్ ద్వారానే జరిగాయి. దీంతో విదేశీ కంపెనీకి వెళ్లిన ప్రభుత్వ సొమ్ము రూ.55 కోట్లను అప్పటి స్పెషల్ సీఎస్ అర్వింద్ కుమార్ చెల్లించాలంటూ ప్రస్తుత ప్రభుత్వం ఆయనకు నోటీసులు పంపింది. కాగా, ఈ విషయంలో తన పాత్ర ఏమీ లేదని.. అప్పటి మంత్రి కేటీఆర్ చెప్తేనే చేశానని అర్వింద్ కుమార్ సమాధానం ఇచ్చారు. దీంతో ఈ వ్యవహారంలో అవినీతి, అక్రమాలు జరిగినట్లు గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఎంక్వైరీ కోసం ఏసీబీకి ఆదేశించింది.

మరోవైపు, ఈ కేసు వ్యవహారంపై కేటీఆర్ పలుమార్లు స్పందించిన విషయం తెలిసిందే. ఈ-రేస్‌కు కోసం ప్రభుత్వం తరపున చేసిన ఖర్చు కేవలం రూ.40 కోట్లు మాత్రమే అని కానీ హైదరాబాద్‌కు వచ్చిన ప్రయోజనం రూ.700 కోట్లు అని క్లారిటీ ఇచ్చారు. ఇదే విషయాన్ని నీల్సన్ అనే సంస్థ కూడా చెప్పిందని గుర్తు చేశారు. ఫార్ములా ఈ-రేస్, మొబిలిటీ వీక్ అనే కార్యక్రమం ద్వారా దాదాపు రూ.2,500 కోట్లు పెట్టుబడులు వచ్చాయన్నారు. ఈ-రేస్‌ను ప్రభుత్వం తరపున కార్యక్రమంగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకు రూ.55 కోట్లు ఖర్చు చేశామని చెప్పుకొచ్చారు. ఇందులో అరవింద్ కుమార్ తప్పు ఏం లేదని నేను ఈ మొత్తానికి బాధ్యత తీసుకుంటానని స్పష్టం చేశారు. పురపాలక శాఖలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ,

పురపాలక శాఖలో ఇంటర్నల్‌గా డబ్బు అడ్జస్ట్‌మెంట్ చేసుకోవచ్చని దీనికి కేబినెట్ అప్రూవల్ అవసరం లేదన్నారకు. హెచ్ఎండీఏ స్వతంత్ర బోర్డు అన్న కేటీఆర్ ఈ-రేస్ కారణంగా 49 దేశాల్లో హైదరాబాద్ పేరు తెలిసేలా చేశామన్నారు. ఈ కేసులో ఎలాంటి విచారణకైనా సిద్ధమేనంటూ కామెంట్స్ కూడా చేశారు. ఏదేమైనా ఇవాలో రేపో ..ఎప్పుడైనా కానీ కేటీఆర్ అరెస్టు మాత్రం తప్పదని అర్థమవుతోంది.

# జనసేనలోకి మంచు మనోజ్, మౌనిక?



మంచు కుటుంబ తగాదాలో కొత్త ట్విస్ట్ చోటుచేసుకుంది. మోహన్ బాబు చిన్న కొడుకు మంచు మనోజ్, ఆయన భార్య మౌనిక రాజకీయ రంగ ప్రవేశానికి సర్వం సిద్ధమైనట్టు ప్రచారం చక్కర్లు కొడుతోంది. ఈ పొలిటికల్ అరంగేట్రానికి ఆళ్లగడ్డ వేదిక కానున్నట్టు సమాచారం. సోమవారం, మాజీ ఎమ్మెల్యే శోభానాగిరెడ్డి జయంతి. ఈ సందర్భంగా ఆళ్లగడ్డలో వేడుకల్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి మనోజ్, మౌనిక దంపతులకు ఆహ్వానం వెళ్లింది. అయితే వీరిద్దరూ ఏకంగా వెయ్యి కార్లతో భారీ ర్యాలీగా వెళ్లాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. అనంతరం, భూమా ఘాట్ నుంచి రాజకీయ అరంగేట్రంపై ప్రకటన చేస్తారని చర్చ నడుస్తోంది. అందులో భాగంగా తమ బలం నిరూపించుకునేందుకు ఇలా ర్యాలీగా వస్తున్నారనే సమాచారం. భూమా కుటుంబంలో ప్రస్తుతం టీడీపీ నుంచి నాగిరెడ్డి పెద్ద కూతురు అఖియప్రియ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. అయితే, అఖిలప్రియతో ఉన్న కొన్ని ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాల నేపథ్యంలో మౌనిక.. జనసేన వైపు చూస్తున్నారనే టాక్ నడుస్తోంది. ఈ కారణంగానే జనసేనలో చేరుతున్నట్టు వార్తలు వినిపిస్తుయి. జనసేనలో ఉంటే టికెట్ కూడా దక్కే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

ఇక, మౌనిక పొలిటికల్ ఎంట్రీపై మనోజ్ గతంలోనే కీలక కామెంట్స్ చేశారు. అంతకుముందు తిరుమల దర్శనానికి వెళ్లిన సమయంలో మనోజ్ మాట్లాడుతూ.. మౌనిక రాజకీయాల్లోకి వెళ్లితే కచ్చితంగా తన మద్దతు ఉంటుందన్నారు. ఇదే సమయంలో తనకు మాత్రం రాజకీయాల్లోకి వచ్చే ఆసక్తి లేదన్నారు. రాజకీయాల్లోకి రాకపోయినప్పటికీ ప్రజలకు సేవ చేయాలనే కోరిక మాత్రం తనకు ఉందన్నారు. నిజానికి, భూమా కుటుంబం రాజకీయాల్లో ఎప్పటి నుంచో ఉంది. భూమా నాగిరెడ్డి, శోభానాగిరెడ్డిలు కర్నూలు జిల్లా రాజకీయాల్లో కీలక నేతలు.. వారి మరణం తర్వాత భూమా నాగిరెడ్డి పెద్ద కుమార్తె అఖిలప్రియ రాజకీయాల్లో కొనసాగుతున్నారు. ఆమె 2014 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున ఆళ్లగడ్డ నుంచి పోటీచేసి విజయం సాధించారు. తండ్రి నాగిరెడ్డి నంద్యాల నుంచి పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత ఇద్దరు టీడీపీలో చేరగా.. కొంతకాలానికి నాగిరెడ్డి మృతి చెందారు. ఇక, భూమా జగత్‌విఖ్యాత్ రెడ్డి కూడా రాజకీయాల్లో ఉన్నారు. నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల బాధ్యతల్ని భూమా కుటుంబమే చూసుకుంటోంది. ఇప్పుడు భూమా మౌనిక పొలిటికల్ ఎంట్రీపై చర్చ జరుగుతోంది.

ఇదిలావుండగా, తన పొలిటికల్ ఎంట్రీపై జరుగుతున్న ప్రచారంపై మనోజ్ స్పందించారు. ప్రస్తుతానికి ఏమీ మాట్లాడలేనని అన్నారు. అత్త గారి జయంతి నాడు మొదటిసారి తమ కూతురు దేవసేన శోభను ఆళ్లగడ్డ తీసుకొచ్చామని, జయంతి రోజు తీసుకొద్దామనే ఇన్నాళ్లూ ఇక్కడకు తీసుకురాలేదు. తమ కుటుంబం, సోదరులు, స్నేహితులతో కలిసి ఇక్కడకు వచ్చానన్నారు. కానీ రాజకీయాల్లోకి రావటాన్ని మాత్రం కొట్టిపారేయలేదు. కాబట్టి, మనోజ్ మౌనిక పొలిటికల్ ఎంట్రీ ఖాయమనే అనుకోవచ్చు.

# వచ్చే ఏడాది బీజేపీకి కొత్త అధ్యక్షుడు



న్యూఢి, డిసెంబర్ 17: కొత్త ఏడాదిలో భారతీయ జనతా పార్టీ నూతన జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకోనున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఇప్పటికే అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియను మొదలు పెట్టినట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. ఈ ఎంపిక ప్రక్రియ వచ్చే ఏడాది ఫిబ్రవరికల్లా పూర్తి అవుతుందని పేర్కొన్నాయి. పార్టీ రాజ్యాంగం ప్రకారం.. జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే ప్రక్రియను ప్రారంభించే ముందు కనీసం సగం రాష్ట్ర యూనిట్లలో సంస్థాగత ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే ప్రస్తుతం జరుగుతున్న సంస్థాగత ఎన్నికలు సజావుగా సాగుతున్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి. సగానికి పైగా రాష్ట్ర యూనిట్లలో పోలింగ్ ప్రక్రియ జనవరి మధ్య నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఫిబ్రవరి చివరికి జేపీ నడ్డా స్థానంలో కొత్త అధ్యక్షుడు బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు వెల్లడిరచాయి. కాగా, ప్రస్తుతం బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా జేపీ నడ్డా ఉన్న విషయం తెలిసిందే. 2020లో ఆయన బీజేపీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. ఇక ఇటీవలే కేంద్రంలో ఎన్డీయే కూటమి మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నడ్డాను కేంద్ర మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన పార్టీ జాతీయ అధ్యక్షుడితోపాటు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిగానూ వ్యవహరిస్తున్నారు. ఇక పార్టీ చీఫ్ పదవీకాలం మూడు సంవత్సరాలే. దీంతో ఇటీవలే ఆయన పదవీ కాలం ముగిసింది. అయితే, 2024 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నడ్డా పదవీకాలాన్ని పొడిగించారు.

**బీజేపీ కొత్త అధ్యక్షుడు ఎవరు?**

మరోవైపు తదుపరి పార్టీ అధ్యక్షుడు ఎవరన్న దానిపై జోరుగా చర్చ నడుస్తున్నది. కేంద్ర మంత్రులుగా పనిచేస్తున్న వారిలోనే ఒకరికి జాతీయాధ్యక్షుడి బాధ్యతలు అప్పగిస్తారా..? లేక కొత్త వారిని తీసుకుంటారా..? అనే విషయంపై తీవ్రంగా చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో రేసులో పలువురి పేర్లు కూడా వినిపిస్తున్నాయి. మహారాష్ట్ర మాజీ మంత్రి, బీజేపీ జనరల్ సెక్రటరీ వినోద్ తావ్డే పేరు రేసులో ప్రధానంగా వినిస్తున్నది. బీఎల్ సంతోష్ తర్వాత పార్టీ జనరల్ సెక్రటరీల్లో అత్యంత ప్రభావవంతమైన నేతగా తావ్డేకు పేరున్నది. అలాగే తెలంగాణకు చెందిన కే లక్ష్మణ్ కూడా రేసులో ఉన్నారు. ప్రస్తుతం ఆయన పార్టీ ఓబీసీ మోర్చా చీఫ్‌గా వ్యవహరిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉన్నది. రేసులో సునీల్ బన్సల్ పేరు కూడా వినిపిస్తున్నది. ఆయన తెలంగాణ, బెంగాల్, ఒడిశా రాష్ట్రాల ఇన్‌చార్జిగా ఉన్నారు. ఎంపీ ఓం మాథుర్ కూడా అధ్యక్ష రేసులో ఉన్నారు. మరోవైపు, పార్టీ తొలి మహిళా అధ్యక్షురాలిగా కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ నియమితులయ్యే అవకాశమున్నట్టు వార్తలు వస్తున్నాయి.

# ఎన్‌టీఏ 2025 పరీక్షల్లో అనేక విప్లవాత్మక మార్పులు



**ఉన్నత విద్యా సంస్థలకు ప్రవేశ పరీక్షలు మాత్రమే నిర్వహిస్తాం**
**ప్రభుత్వ ఉద్యోగాల నియామక పరీక్షలు నిర్వహించదు**
**భవిష్యత్‌లో కంప్యూటర్ అడాప్టివ్ టెస్ట్, టెక్ ఆధారిత పరీక్షలు**
**నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని కూడా పూర్తిగా ప్రక్షాళన చేస్తాం**
**కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడి**

న్యూఢిల్లీ, డిసెంబర్ 17: ఎన్‌టీఏ 2025 పరీక్షల్లో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నట్లు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడిరచారు. ఎన్‌టీఏ 2025 నుంచి ఉన్నత విద్యా సంస్థలకు ప్రవేశ పరీక్షలు మాత్రమే నిర్వహిస్తుందని, ప్రభుత్వ ఉద్యోగాల నియామక పరీక్షలు నిర్వహించదని ఆయన స్పష్టం చేశారు. వచ్చే ఏడాది నుంచి నీట్–యూజీ పరీక్షను పెన్–పేపర్ విధానంలో నిర్వహించాలా లేదా ఆన్‌లైన్‌లో నిర్వహించాలా అనే అంశంపై ఆరోగ్య మంత్రిత్వ శాఖతో చర్చిస్తున్నామని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. భవిష్యత్‌లో కంప్యూటర్ అడాప్టివ్ టెస్ట్, టెక్ ఆధారిత ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం చూస్తోందని ఆయన అన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని కూడా 2025లో పూర్తిగా ప్రక్షాళన చేస్తామని చెప్పారు. కొత్తగా 10 పోస్టులు సృష్టిస్తామని తెలిపారు. ''ఎన్‌టీఏ కేవలం ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎంట్రన్ పరీక్షల నిర్వహణకే పరిమితం అవుతుంది. వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వ ఉద్యోగాల నియామక పరీక్షలు నిర్వహించబోదు. కామన్ యూనివర్శిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ)–యూజీని ఏడాదికి ఒకసారి నిర్వహిస్తాం. జీరో ఎర్రర్ టెస్టింగ్ ఉందని నిర్ధరించడానికి ఎన్‌టీఏ పనితీరులో అనేక మార్పులు ఉంటాయి'' అని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యానించారు. ఈ ఏడాది నీట్ పరీక్ష పేపర్ లీక్ అవ్వడం, ఇతర అవాంతరాల కారణంగా పలు పరీక్షలు రద్దవ్వడం వల్ల ఎన్‌టీఏను పూర్తిగా ప్రక్షాళన చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే ఉన్నత స్థాయి ప్యానెల్ సిఫార్సు మేరకు తాజాగా సంస్కరణలు తీసుకొచ్చింది. ఎన్‌టీఏను కేవలం ప్రవేశ పరీక్షల నిర్వహణకే పరిమితం చేసింది.

# వినూత్న రీతిలో ప్రియాంక గాంధీ నిరసన



న్యూఢిల్లీ, డిసెంబర్ 17 : పార్లమెంట్‌కు కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా పలు అంశాలపై వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్నారు. నిన్న 'పాలస్తీనా' బ్యాగ్‌తో పార్లమెంట్‌కు హాజరైన ప్రియాంక.. మంగళవారం 'బంగ్లాదేశ్' బ్యాగ్‌తో దర్శనమిచ్చారు. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు 'బంగ్లాదేశ్ మైనారిటీల పక్షాన నిలవండి' అంటూ రాసి ఉన్న బ్యాగ్‌తో పార్లమెంట్‌కు వచ్చారు. విపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు సైతం ఇదే బ్యాగ్‌తో పార్లమెంట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఆవరణలో నిరసన తెలిపారు.



# మరోసారి స్కూళ్లకు బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ, డిసెంబర్ 17: దేశ రాజధాని ఢిల్లీలో స్కూళ్లకు బాంబు బెదిరింపులు రావడం నిత్యకృత్యంగా మారింది. గత వారం రోజుల్లో ఏకంగా మూడుసార్లు ఢిల్లీలో పాఠశాలలకు ఇలాంటి బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి బెదిరింపులు వచ్చాయి. మంగళవారం ఉదయం ఢిల్లీలో ని కొన్ని పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. దక్షిణ ఢిల్లీలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్, నార్త్ వెస్ట్ ఢిల్లీలోని సరస్వతి విహార్‌లో గల ఓ పాఠశాలకు బెదిరింపులు వచ్చినట్లు చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇ–మెయిల్ ద్వారా బెదిరింపులకు పాల్పడినట్లు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఆయా పాఠశాలల వద్దకు చేరుకొని విద్యార్థులను, సిబ్బందిని ఖాళీ చేయించారు. అనంతరం బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో పాఠశాలల ఆవరణలో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడిరచారు.

# గుజరాత్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**ట్రక్కును ఢీకొన్న ప్రైవేట్ బస్సు**
**ఆరుగురు మృత్యువాత**

గాంధీనగర్, డిసెంబర్17: గుజరాత్ రాష్ట్రంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. భావ్‌నగర్ జిల్లాలోని జాతీయ రహదారిపై డంపర్ ట్రక్కును ఓ ప్రైవేట్ బస్సు బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో ట్రాపాజ్ గ్రామ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. భావ్‌నగర్ నుంచి మహువ వైపు వెళ్తున్న బస్సు.. డంపర్ ట్రక్కును వెనుకనుంచి బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా.. సుమారు 10 మంది గాయపడినట్లు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ హర్షద్ పటేల్ తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడిరచారు.

# మూడు రోజుల్లో.. మూడు బిల్లులు



హైదరాబాద్,డిసెంబర్ 17 : అసెంబ్లీ శీతాకాల సమావేశాలు మూడో రోజుకు చేరాయి. మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నాయి. ముందుగా ప్రశ్నోత్తరాలు కొనసాగనుంది. ఆ తర్వాత మూడు కీలక బిల్లులు ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టనుంది. వాటిలో యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, తెలంగాణ యూనివర్సిటీల చట్ట సవరణ, జీఎస్టీ చట్ట సవరణ బిల్లులు ఉన్నాయి. బిల్లుల ఆమోదం కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశ పెట్టనున్నారు. అదేవిధంగా టూరిజం పాలసీపై లఘు చర్చ జరగనుంది. కాగా, అసెంబ్లీ సమావేశాలు వాడీ వేడిగా జరుగుతున్నాయి. లగచర్లలో పోలీసుల దౌర్జన్యకాండ, గిరిజన రైతులపై థర్డ్ డిగ్రీ, రైతుకు బేడీలు వేసిన ఘటనను నిరసిస్తూ సోమవారం బీఆర్ఎస్ సభ్యులు చేసిన ఆందోళనలతో ఉభయసభలు దద్దరిల్లాయి. బాధిత రైతులకు న్యా యం జరిగేదాకా కాంగ్రెస్ సర్కార్‌ను వదిలేది లేదని గులాబీ పార్టీ హెచ్చరించింది. బీఏసీ సమావేశం తర్వాత మధ్యాహ్నం రెండున్నరకు శాసనసభ సమావేశం కాగానే పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యాటక బిల్లుపై చర్చ ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సభ్యులు ముందుగా లగచర్ల గిరిజన రైతులపై పోలీసులు సాగించిన దమనకాండపై చర్చించేందుకు అనుమతించాలని పట్టుబట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ లగచర్ల రైతులపై పోలీసు దౌర్జన్యకాండను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ అంశంపై తాము ఇచ్చిన వాయిదా తీర్మానాలను ఆమోదించి చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. లగచర్లలో ఫార్మా పేరిట ప్రభుత్వ నిర్బంధ భూసేకరణను ప్రతిఘటించిన అమాయక గిరిజన రైతులపై సర్కార్ నిర్బంధకాండ, పోలీసుల థర్డ్ డిగ్రీ ప్రయోగం, నెల రోజులుగా వారిని జైళ్లలో బంధించిన అంశంపై చర్చ కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు వాయిదా తీర్మానం ఇచ్చారు. దీనిని తిరస్కరిస్తున్నట్టు స్పీకర్ ప్రకటించడంతో బీఆర్ఎస్ సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం.. దొంగల రాజ్యం దోపిడి రాజ్యం' 'నహీచలేగా నహీచలేగా.. తానాషాహీ నహీచలేగా' 'నహీచలేగా నహీచలేగా.. లాఠీ లూటీ నహీచలేగా' అంటూ పెద్దపెట్టున నినదించారు. శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుంటూ, విపక్ష సభ్యులు సభాసంప్రదాయాలు పాటించాలని కోరారు. ఆందోళన విరమించాలని, మాట్లాడే అవకాశం కల్పిస్తామని సభాపతి సూచించారు. బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన కొనసాగించడంతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రూల్ బుక్‌లోని అంశాలను చదివి వినిపించారు. సభలో నినాదాలు చేయడం, ప్లకార్డులు ప్రదర్శించడం నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. అయినా బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన కొనసాగించడంతో నిరసన మధ్యనే మంత్రి జూపల్లి ప్రసంగం కొనసాగించాలని స్పీకర్ సూచించారు. విపక్ష సభ్యుల వద్ద ఉన్న ప్లకార్డులను తీసుకోవాలని మార్షల్స్‌కు స్పీకర్ ఆదేశించారు. మార్షల్స్ దగ్గరకు రావడంతో బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్ పోడియంవైపు దూసుకెళ్లారు. బీఆర్ఎస్ సభ్యుల నినాదాలు, ప్లకార్డులు తీసుకునేందుకు మార్షల్స్ ప్రయత్నించడంతో కాసేపు ఉద్రిక్తత ఏర్పడిరది. దీంతో సభను స్పీకర్ మంగళవారానికి వాయి దావేశారు.


## బీఆర్ఎస్‌పై ఆర్థిక శాఖ మంత్రి మాటలు అవాస్తవం : హరీశ్‌రావు



హైదరాబాద్, డిసెంబర్ 17 : బీఆర్ఎస్‌పై కావాలనే బురద జల్లుతున్నారని, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఉచిత విద్యుత్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్న ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఖండిరచారు. శాసనసభలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉచిత విద్యుత్‌కు రూ. 65 వేల కోట్లు విద్యుత్ శాఖకు చెల్లించామని స్పష్టం చేశారు. కానీ భట్టి విక్రమార్క తప్పుడు లెక్కలు చెబుతూ సభను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలో రూ. 1,27,208 కోట్లు అప్పు చేసి కొత్తగా ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేదు. మా హయాంలో అనేక సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాం. మిషన్ భగీరథ ద్వారా మంచినీటిని అందించాం. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆస్తుల కల్పన చేసింది.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అప్పులు చేసి కమీషన్ల కోసం పంచుకుతిన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన అవసరం ఉంది. అసలు తాము అడిగిన ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా భట్టి ఏదేదో మాట్లాడుతున్నారు. తమ హయాంలో వద్దు కొన్నాం.. ఠంచన్‌గా పైసలు ఇచ్చాం. భట్టి విక్రమార్క వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# ఢిల్లీలో తారాస్థాయికి వాయు పొల్యూషన్

న్యూఢిల్లీ, డిసెంబర్ 17 : దేశరాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం మరోసారి తీవ్ర స్థాయికి చేరింది. మంగళవారం ఉదయం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఏకంగా 400 మార్క్‌ను దాటింది. గాలి కాలుష్యానికి తోడు చలి తీవ్రతకూడా పెరిగింది. ఢిల్లీలో ఈ సీజన్‌లో అత్యంత శీతల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 5 డిగ్రీల కనిష్ట స్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ డేటా ప్రకారం.. ఢిల్లీలో గాలి నాణ్యత తీవ్రమైన కేటగిరీలో నమోదైంది. మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో ఢిల్లీ ఎన్సీఆర్ ప్రాంతంలో ఏక్యూఐ లెవల్స్ 421గా నమోదయ్యాయి. నగరంలోని 37 మానిటరింగ్ స్టేషన్లలోని 26 స్టేషన్లు 400 మార్క్‌ను దాటాయి. జహంగీర్‌పురిలో ఏక్యూఐ లెవల్స్ 466గా నమోదయ్యాయి. ఆనంద్ విహార్‌లో 465, బవానా ప్రాంతంలో 465, రోహిణి ప్రాంతంలో 462, లజ్‌పత్ నగర్‌లో 461, అశోక్ విహార్‌లో 456, పంజాబి భాగ్‌లో 452గా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నమోదైంది. గాలి నాణ్యత సున్నా నుంచి 50 మధ్య ఉంటే బాగా ఉన్నట్టు అర్థం. 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తికరమైనదని, 101 నుంచి 200 వరకు ఉంటే మితమైన నాణ్యత, 201 నుంచి 300 ఉంటే తక్కువ నాణ్యత అని, 301 నుంచి 400 వరకు ఉంటే చాలా పేలవమైనదని, 401 నుంచి 500 ఉంటే ప్రమాదకరస్థాయిగా పరిగణిస్తారు. రాజధానిలో కాలుష్యం మరోసారి తీవ్రస్థాయికి చేరడంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గాలి నాణ్యత పెంచేందుకు చర్యలు చేపట్టింది. మంగళవారం నుంచి ఢిల్లీలో మరోసారి గ్రాఫ్ 4 ఆంక్షలను విధించినట్లు ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ మేనేజ్‌మెంట్ వెల్లడిరచింది. డీజిల్ వాహనాలపై ఆంక్షలు విధించారు.



## హైడ్రా ఏర్పాటుకు ముందు

# అనుమతులుంటే సరే





**వాటి జోలికి వెళ్లబోమన్న కమిషనర్ రంగనాథ్**
**చెరువుల పరిసరాల్లో వ్యర్థాలు నింపితే చర్యలు**

హైదరాబాద్, డిసెంబర్17: చెరువులను చెర పట్టి, ప్రభుత్వ భూములను కొల్లగొట్టి అక్రమ కట్టడాలను నిర్మించిన అక్రమార్కులకు హడలెత్తిస్తోన్న హైడ్రా సంచలన నిర్ణయం తీసుకుంది.. హైడ్రా ఏర్పాటుకు ముందు అనుమతులు తీసుకుని కట్టుకున్న నిర్మాణాల జోలికి వెళ్లబోమని హైడ్రా కమిషర్ రంగనాథ్ కీలక ప్రకటన చేశారు.. హైడ్రా ఏర్పాటుకు ముందు అనుమతి తీసుకున్న, నిర్మించుకున్న ఇళ్లను కూల్చబోము అంటూ మరోసారి స్పష్టత ఇచ్చారు. జూలై తర్వాత నిబంధనలకు విరుద్దంగా నిర్మించిన ఇళ్లపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. చెరువు చుట్టు పక్క ప్రక్కల ప్రాంతాల్లో నిర్మాణ వ్యర్థాలు డంప్ చేయకూడదని అంటూ హెచ్చరించారు. మంగళవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ హైదరాబాద్ కూకట్‌పల్లిలో కాముని చెరువు, మైసమ్మ చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా కాముని చెరువులో అక్రమ నిర్మాణాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా ఏర్పడిన తర్వాత జరిగిన అక్రమ నిర్మాణాలను మాత్రమే తొలగిస్తామన్నారు. 2024 జూలై నాటికే అక్కడ నివాసాలు వుంటే వాటి జోలికి హైడ్రా వెళ్లదని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ నిబంధన వాణిజ్య సముదాయాలకు వర్తించదన్నారు. ప్రభుత్వ విభాగాల అనుమతులున్న నిర్మాణాల జోలికి కూడా హైడ్రా వెళ్లదంటూ క్లారిటీ ఇచ్చారు. కాముని చెరువు, మైసమ్మ చెరువు పరిసరాల్లో నివాసితులు చెరువులు కబ్జా కాకుండా చూడాలని స్థానికులకు విజ్ఞప్తి చేసారు. కాగా.. మూసాపేట, ఖైతలాపూర్ పరిధిలోని కాముని చేరువులో నిర్మాణ వ్యర్థాలతోపాటు మట్టిని నింపి కొంతమంది ఆక్రమిస్తున్నారని, చెరువులకు అనుసంధానంగా ఉండే కాలువలు కబ్జాకు గురైనట్లు ఫిర్యాదులు రావడంతో హైడ్రా కమిషనర్ క్షేత్ర స్థాయిలో పర్యటించి.. అక్కడి పరిస్థితులను పరిశీలించారు. కాముని చెరువులో మట్టిపోసినవారిని వదిలిపెట్టమని హెచ్చరించారు. సర్కారు విధానాలకు అనుగుణంగా చెరువుల పరిరక్షణ కోసం పనిచేస్తున్నాం. పేదల జోలికి హైడ్రా మాత్రం రాదు. వాళ్ల ఇళ్లను కూల్చేస్తామనే ప్రచారాలను అస్సలు నమ్మొద్దని రంగనాథ్ విజ్ఞప్తి చేశారు.

# బడిలో ఉండాల్సిన ఆస్పత్రి పిల్లలు పడకలపై ఉన్నారు

**కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ హరీశ్‌రావు**

హైదరాబాద్, డిసెంబర్ 17 : కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ పాఠశాలలన్నీ అధ్వాన్నంగా మారాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. బడిలో ఉండాల్సిన పిల్లలు.. అనారోగ్యంతో ఆస్పత్రి పడకలపై ఉంటున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. ఖమ్మం జిల్లా దానవాయిగూడెం బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో చోటు చేసుకున్న ఘటనపై హరీశ్‌రావు స్పందించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం ఖమ్మం జిల్లా దానవాయిగూడెం బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థిని ప్రాణాల మీదికి తెచ్చింది. మార్చి నుంచి నవంబర్ వరకు లక్ష్మీ భవానీ కీర్తి అనే విద్యార్థిని 15 సార్లు ఎలుకలు కొరికితే అధికారులు ఏం చేసున్నట్లు? అనేక సార్లు ఆస్పత్రికి వచ్చినా ఎందుకు సరైన వైద్యం అందించలేదు. తీవ్ర అనారోగ్యం పాలై మంచం పడితే అధికారులు ఏం చేస్తున్నట్లు? ఇది అత్యంత అమానవీయ ఘటన అని హరీశ్‌రావు పేర్కొన్నారు. అనేకసార్లు రేబిస్ వ్యాక్సిన్ ఇవ్వడం వల్ల కాళ్లు చచ్చు పడిపోయిన దారుణమైన పరిస్థితి. గురుకులాల్లో ఇంత దారుణమైన పరిస్థితులు ఉంటే, గురుకుల బాటతో పేరుతో ఒక్కరోజు ప్రచారం చేసి చేతులు దులుపుకున్నారు. కాంగ్రెస్ పాలనలో బడిలో పాఠాలు వినాల్సిన పిల్లలు, అనారోగ్యంతో ఆసుపత్రి పడకలపైకి చేరుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, తీవ్రంగా అనారోగ్యం పాలైన లక్ష్మీ భవానీ కీర్తిని నిమ్స్ ఆసుపత్రికి తరలించి అత్యుత్తమ వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఎలుకలు కొరికిన ఇతర విద్యార్థుల ఆరోగ్యాలు సంరక్షించాలని, మంచి వైద్యం అందించాలని కోరుతున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# మద్యం అమ్మకాలతో రూ.20వేల కోట్ల ఆదాయం

**తెలంగాణలో ఎనిమిది నెలల్లో రికార్డు స్థాయి ఆదాయం**

**అసెంబ్లీలో ప్రకటించిన ఎక్సైజ్ శాఖ**





హైదరాబాద్,డిసెంబర్ 17 : తెలంగాణలో మద్యం విక్రయాలతో ప్రభుత్వ ఖజానాకు 8 నెలల్లో రూ.20,903.13 కోట్ల ఆదాయం సమకూరినట్లు అబ్కారీ శాఖ వెల్లడిరచింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబరు వరకు ఎక్సైజ్ శాఖకు మద్యం అమ్మకాలపై రెవెన్యూ రూపేణా రూ.10,285.58 కోట్లు విలువ ఆధారిత పన్ను రూపంలో రూ.10,607.55 కోట్లు వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ అసెంబ్లీలో ప్రకటించింది. తెలంగాణ శాసనసభలో బీఆర్ఎస్ సభ్యులు కేపీ వివేకానంద, హరీశ్ రావు, కౌశిక్ రెడ్డి, అనిల్ జాదవ్‌లు అడిగిన ప్రశ్నలకు అబ్కారీ శాఖ సమాధానం ఇచ్చింది. బెల్టు షాపులు ఎన్ని ఉన్నాయని సభ్యులు అడిగిన ప్రశ్నకు.. రాష్ట్రంలో బెల్ట్ షాపులకు సంబంధించి ఎలాంటి ప్రస్తావన లేదని ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. అక్రమ మద్యం విక్రయాలను కట్టడి చేస్తున్నామని, ఎక్సైజ్ చట్టాల ప్రకారం ఎప్పటికప్పుడు అనధికారిక మద్యం విక్రయా లపై కేసులు నమోదు చేస్తున్నామని సభలో ప్రకటించింది. ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు నాటికి అనధికారిక విక్రయాలపై 6,915 కేసులు నమోదు చేశామని వివరించారు. ఈ కేసుల్లో 6,728 మందిని అరెస్టు చేయడంతో పాటు 74,425 లీటర్ల మద్యం 353 వాహనాలను జప్తు చేసినట్లు వెల్లడిరచారు. మద్యపాన దుష్ప్రభావాలు, మత్తు పదార్థాల దుర్వినియోగంపై తెలంగాణలో 735 అవగాహన సదస్సులు నిర్వహించారు. అక్టోబర్ 16 నుంచి ఏపీలో ప్రైవేట్ మద్యం దుకాణాలు ప్రారంభం అయ్యాయి. అక్టోబర్ 16 నుంచి డిసెంబర్ 9 వరకు రూ.4,677 కోట్ల వ్యాపారం జరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. 55 రోజుల వ్యవధిలో 61.63 లక్షల కేసుల లిక్కర్, 19.33 లక్షల కేసుల బీర్లు విక్రయించినట్టు ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. వైసీపీ హయాంలో ప్రభుత్వమే స్వయంగా మద్యం షాపులు నిర్వహించింది. అయితే కూటమి సర్కార్ ఆ విధానానికి స్వస్తి పలికింది. రెండేళ్ల పాటు అమల్లో ఉండే కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చిన కూటమి ప్రభుత్వం...ప్రైవేట్ లిక్కర్ షాపులకు టెండర్లు పిలిచి 3,300 లిక్కర్ షాపులు ఏర్పాటు చేసింది.రాష్ట్ర వ్యాప్తంగా 3,300 లిక్కర్ దుకాణాల టెండర్ల రూపంలో ప్రభుత్వానికి దాదాపు రూ.2,000 కోట్ల ఆదాయం సమకూరింది. అక్టోబర్ 16వ తేదీ నుంచి నూతన మద్యం షాపులు ప్రారంభం అయ్యాయి. అయితే నిబంధనల ప్రకారం షాపులు పాడుకున్న యజమానులకు 20 శాతం కమిషన్ ఇవ్వాలి. అయితే ఇంకా పాత మద్యమే విక్రయిస్తున్నట్లు చెబుతున్న ఎక్సైజ్ శాఖ...కమిషన్ తక్కువగా ఇస్తుంది. ఇప్పటికైనా 20 శాతం కమిషన్ ఇవ్వాలని మద్యం షాపుల యజమానుల నుంచి ఒత్తిడి వస్తుంది. 20 శాతం కమిషన్ ఇవ్వకుంటే నష్టాలు వస్తాయని మద్యం దుకాణాలు యజమానులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైన్ షాపులు, బార్లలో కలిపి అక్టోబర్ 16వ తేదీ నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు రూ.4,677 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. రానున్న రోజుల్లో లిక్కర్ సేల్స్ మరింత పెరిగే అవకాశం ఉంది. క్రిస్టమస్, సంక్రాంతి సీజన్ కావడంతో లిక్కర్ సేల్స్ మరింత పెరుగుతాయని అంచనా వేస్తున్నారు.

# ఐదో ఆర్థికశక్తిగా ఎదిగిన భారత్

**55 ఏళ్ల కాంగ్రెస్ ఏలుబడిలో 77 సార్లు సవరణలు**

**కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పారు**

**సర్దార్ వల్లనే దేశం ఐక్యంగా ఉంది**

**రాజ్యసభలో చర్చలో హోంమంత్రి అమిత్ షా**



న్యూఢిల్లీ, డిసెంబర్17: మనల్ని పాలించిన బ్రిటన్‌ను అధిగమించి భారత్ ప్రస్తుతం ఐదో ఆర్థికశక్తిగా అవతరించిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా గుర్తు చేశారు. కాంగ్రెస్ 55 ఏళ్ల పాలనలో 77 సార్లు రాజ్యాంగ సవరణ జరిగిందన్నారు. ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా నియోజకవర్గాల సంఖ్యను పెంచేశారని ఆరోపించారు. రాజ్యసభలో రాజ్యాంగంపై జరిగిన చర్చ సందర్భంగా అమిత్ షా మాట్లాడారు. ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం మరింత బలం చేకూర్చిందని అన్నారు. నియంతృత్వ అహంకారంతో విర్రవీగిన కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. కళ్లద్దాలు పరాయి దేశానివైతే.. భారతీయత ఎప్పటికీ కనిపించదంటూ రాహుల్ గాంధీకి చురకలు అంటించారు. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్య్రపు హక్కును కాలరాసేందుకు అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో రాజ్యాంగ సవరణ చేశారని మండిపడ్డారు. భారత్ ఎప్పటికీ స్వతంత్ర ఆర్థిక శక్తిగా ఎదగలేదంటూ చెప్పిన హస్తం పార్టీకి దేశ ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అమిత్‌షా అన్నారు. దేశాన్ని ఏకం చేసేందుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషిని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రశంసించారు. ఆయన వల్లే దేశం ఇవాళ ఐక్యంగా ఉందన్నారు. అప్పట్లో ఆయన చేసిన కృషి వల్లే భారత్ మహోన్నత దేశంగా ఆవిర్భవించిందన్నారు. ఒక్క రక్తపు బొట్టు కూడా చిందించకుండా బ్రిటిష్ వారి నుంచి అధికార మార్పిడి జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష కాంగ్రెస్‌పై అమిత్ షా విమర్శలతో విరుచుకుపడ్డారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కృషి చేయలేదని, మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే వారికి అపన్నహస్తం అందించారని అమిత్ షా పేర్కొన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే ముస్లిం మహిళల హక్కులను ఏళ్ల తరబడి కాలరాశారని విమర్శించారు. ప్రజల అభిమానాన్ని పొందలేక..ఎన్నికల్లో ఓడిపోయి.. ఈవీఎంలను తప్పుబట్టడం సిగ్గుచేటన్నారు. హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల్లో ఓటమికి కారణం ఈవీఎంలే అని చెప్పిన కాంగ్రెస్.. జార్ఖండ్ గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.




# తుఫాన్ బీభత్సానికి మాయట్ అతలాకుతలం

**ఆదుకునేందుకు సిద్ధమని ప్రధాని మోడీ ప్రకటన**

న్యూఢిల్లీ, డిసెంబర్17:తుపాను ధాటికి ఫ్రాన్స్‌కు చెందిన ఓవర్సీస్ ప్రాంతమైన మాయోట్ దీవులు అతలాకుతలమయ్యాయి. దీనిపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ విపత్కర సమయంలో ఫ్రాన్స్‌కు భారత్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అవసరమైన మేర సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈమేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. తన ఆలోచనలన్నీ బాధిత కుటుంబాలపైనే ఉన్నాయని అన్నారు. అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ సారథ్యంలో ఈ విషాదాన్ని ఫ్రాన్స్ అధిగమిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఆఫ్రికాఖండంలోని మొజాంబిక్ ఛానల్‌లో ఈ దీవులుంటాయి. హిందూ మహాసముద్రంలోని మయోట్ దీవుల్లో చిడో తుపాను సోమవారం బీభత్సం సృష్టించింది. తుపాను దాటికి దీవి మొత్తం చిగురుటాకులా వణికిపోయింది. గడిచిన వందేళ్లలో ఈ స్థాయిలో తుపాను రావడం ఇదే తొలిసారి. తుపాను తీవ్రత తెలుసుకున్న ఫ్రాన్స్ ఆగమేఘాల మీద సహాయక చర్యలు ముమ్మరం చేసింది. అక్కడున్న వారిని రక్షించేందుకు నౌకలను, మిలటరీ హెలికాప్టర్లను రంగంలోకి దింపింది. మీడియా నివేదికల ప్రకారం మరణాలు వేల సంఖ్యలోనే ఉండొచ్చని అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

# నారాయణ స్కూలులో స్టూడెంట్ సూసైడ్

**విద్యార్థి సంఘాల ఆందోళన**



హైదరాబాద్, డిసెంబర్ 17 : హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో తీవ్ర విషాదం జరిగింది. నారాయణ స్కూల్‌లో చదివే ఏడో తరగతి విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో బాలుడి కుటుంబం విషాదంలో మునిగిపోయింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడిని విగతజీవిగా చూసి అతని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. తన కొడుకు చావుకు కారణం నారాయణ విద్యాసంస్థల నిర్వాహకులేనని ఆరోపిస్తున్నారు. బాలుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ శివారులోని హయత్‌నగర్?లో నారాయణ రెసిడెన్షియల్ స్కూల్? ఉంది. దాంట్లో లోహిత్ అనే విద్యార్థి ఏడో తరగతి చదువుతున్నాడు. కొద్ది రోజులుగా లోహిత్ చదువు విషయంలో ఒత్తిడికి గురవుతున్నాడు. ఇదే విషయాన్ని పేరెంట్స్‌కు చెప్పాడు. వారు సర్దిచెప్పి పంపారు. ఈ నేపథ్యంలో.. సోమవారం హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎవరూ లేని సమయంలో రూమ్‌లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. గమనించిన తోటి విద్యార్థులు సిబ్బందికి సమాచారం అందించారు. కానీ.. ఇప్పటికే లోహిత్ మృతిచెందాడు. ఈ విషయం తెలిసిన లోహిత్ తండ్రి.. విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి కాలేజీ ఎదుట ఆందోళనకు దిగారు. లక్షలు పోసి స్కూలుకు పంపింతే.. కొడుకు శవాన్ని గిఫ్టుగా ఇచ్చారని రోదించారు. నారాయణ విద్యా సంస్థల యాజమాన్యం నిర్లక్ష్యం, టీచర్ల వేధింపులు వల్లే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. ఇది ఆత్మహత్యనా.. ఏమైనా చేశారా అనే అనుమానం ఉందన్నారు. తన కొడుకు చనిపోయిన విషయాన్ని ఆలస్యంగా చెప్పారని వివరించారు. చదువు విషయంలో తన కుమారుడిని ఎక్కువగా ఇబ్బంది పెట్టొద్దని గతంలోనే చెప్పానని స్పష్టం చేశారు. చదువు ఒత్తిడి మాత్రమే కాకుండా.. ఈ స్కూల్ లో ఇంకా ఏదో జరుగుతుందని అనుమానం వ్యక్తం చేశారు. నారాయణ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలోనూ నారాయణ విద్యా సంస్థల్లో చాలామంది విద్యార్థులు సూసైడ్ చేసుకున్నారు. తీవ్రమైన ఒత్తిడి కారణంగానే విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. టీచర్లు, సిబ్బంది విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నారనే ఫిర్యాదులూ ఉన్నాయి. ఇన్ని ఘటనలు జరుగుతున్నా.. ఇంతమంది విద్యార్థులు చనిపోతున్నా.. ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

# గ్రూప్ 2 పరీక్షలకు 45.57 శాతమే హాజరు



హైదరాబాద్, డిసెంబర్ 17: తెలంగాణ రాష్ట్రంలో సోమవారంతో గ్రూప్ 2 పరీక్షలు ముగిశాయి. మొత్తం 783 గ్రూప్ 2 పోస్టుల భర్తీకి రెండు రోజుల పాటు జరిగిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. డిసెంబరు 15, 16 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా 1368 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగాయి. అయితే సాధారణంగా గ్రూప్ 2 పరీక్షకు గణనీయమైన పోటీ ఉంటుంది. దరఖాస్తు సమయంలో కూడా దాదాపు ఐదున్న లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఏం జరిగిందో తెలియదుగానీ పరీక్షకు మాత్రం కనీసం సగం మంది కూడా హాజరుకాలేదు. డిసెంబర్ 15 (ఆదివారం) జరిగిన పేపర్ 1 పరీక్షకు 2,57,981 మంది అంటే 46.75 శాతం మంది, పేపర్ 2 పరీక్షకు 2,55,490 మంది అంటే 46.30 మంది పరీక్ష రాశారు. ఇక డిసెంబరు 16న ఉదయం జరిగిన పేపర్ 3 పరీక్షకు 2,51,738 (45.62 శాతం) మంది, మధ్యాహ్నం జరిగిన పేపర్ 4 పరీక్షకు 2,51,486 (45.57 శాతం) మంది హాజరయ్యారు. పేపర్ 3 (ఎకానమీ) కఠినంగా ఉన్నట్లు అభ్యర్థులు తెలిపారు. ఈ పేపర్‌లో కేంద్ర, రాష్ట్రాల బడ్జెట్‌లు, సర్వేలు, పంటలు, జనాభా లెక్కలు, రైతుబంధు, రైతు బీమా, ఆసరా పింఛన్లు, మహాలక్ష్మి పథకం, రెవెన్యూ లోటు, జిల్లాల ర్యాంకులు తదితర అంశాలపై ప్రశ్నలు వచ్చాయని అభ్యర్థులు తెలిపారు. ఇక సోమవారం మధ్యాహ్నం జరిగిన పేపర్ 4 (తెలంగాణ ఉద్యమం, చరిత్ర) పరీక్షలో తెలంగాణ తల్లి విగ్రహంపై సహా తెలంగాణ ఉద్యమం, కమిటీలు, ఉద్యమకారులు, సంస్థలు, పార్టీలు, ఉద్యమ గేయాలు, రైతు ఉద్యమాలు, నిజాం పాలన, విప్లవ సంస్థలు, ఎన్టీఆర్, చంద్రబాబు, కిరణ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ వంటి అంశాలపై ప్రశ్నలు అడిగారు. ఉద్యమంలో కేసీఆర్, సోనియాగాంధీ, చిదంబరం, ప్రణబ్‌ముఖర్జీ పాత్రలపై కూడా ప్రశ్నలు వచ్చాయి. అన్నింటికన్నా పేపర్ 4 పరీక్ష సులభంగా ఉన్నట్లు అభ్యర్థులు పేర్కొన్నారు. ఈ పరీక్ష ఫలితాలు త్వరలోనే వెల్లడికానున్నాయి.

# జమిలితో దేశాభివృద్ధికి బాటలు

**తరచూ ఎన్నికలతో ప్రజల్లో విసుగు**

**మాజీ రాష్ట్రపతి కోవింద్ వ్యాఖ్య**

కోల్‌కతా, డిసెంబర్17: జమిలి ఎన్నికల ద్వారా తరచూ ఎన్నికలు జరిగే అవకాశం ఉండదు కనక దేశాభివృద్ధికి దోహదపడుతుందని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకేసారి ఎన్నికల ప్రతిపాదన కార్యరూపం దాల్చిన తర్వాత ఎన్నికల పక్రియకు అది మరింత ఊతమిస్తుందన్నారు. తద్వారా దేశాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కోల్‌కతాలో ఓ ఆదివాసి సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన ఆయన.. ఏటా ఓట్ల కోసం వచ్చే నేతలతో ఓటర్లు విసిగిపోయారని, తరచూ అటువంటి పరిస్థితి కోరుకోవడం లేదన్నారు. జమిలి బిల్లు పార్లమెంటుకు వచ్చిన తరుణంలో కోవింద్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ‘జమిలి ప్రతిపాదన 2029–30లో పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చిన తర్వాత.. ఏదో ఒక ఎన్నిక కోసం ఓటర్లు ఏటా పోలింగ్ బూత్‌లకు వెళ్లాల్సిన పని ఉండదు. ఇది ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుంది. ప్రస్తుతమున్న జీడీపీకి అదనంగా మరో 1.5శాతం పెరుగుతుంది. ఒకవేళ ఇదే జరిగితే జీడీపీ 10శాతం పెరగడానికి ఎక్కువ సమయం పట్టదు. దాంతో ప్రపంచంలోనే మూడు, నాలుగో ఆర్థిక శక్తిగా మన దేశం నిలుస్తుంది‘ అని మాజీ రాష్ట్రపతి పేర్కొన్నారు.

# జగిత్యాల జిల్లాలో ఏసీబీకి చిక్కిన ఫారెస్ట్ అధికారి

**4500 లంచం తీసుకుంటుండగా పట్టివేత**

జగిత్యాల, డిసెంబర్ 17: జగిత్యాల జిల్లా మెట్ పల్లిలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆఫీసుద్దీన్ ఏసీబీకి చిక్కాడు. కర్ర ట్రాన్స్ పోర్ట్ చేసే పల్లెపు నరేష్ వద్ద రూ.4500 లంచంగా తీసుకుంటుండగా ఏసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని అరెస్టు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంబీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన పల్లేపు నరేష్ జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం ఇప్పపల్లి వద్ద అన్లైన్ ఫర్మిషన్ తో మామిడి చెట్లు తొలగిస్తున్నాడు. వాటిని తరలించేందుకు రోడు అండ్ ట్రాన్స్పోర్ట్ పర్మిషన్ కోసం కథలాపూర్ మండల ఇంచార్జి డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అయిన అఫీసుద్దీన్‌ను సంప్రదించాడు. పదివేలు ఇస్తేనే ఫర్మిషన్ ఇస్తానని చెప్పడంతో ముందుగా 5000 ఇచ్చాడు. మరో ఐదువేలు కావాలని అడగటంతో నరేష్ ఏసీబీని ఆశ్రయించాడు. నరేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో రంగంలోకి దిగిన ఏసిబికి అడ్డంగా దొరికాడు ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్. కర్ర సప్లై చేసే నరేష్ మెట్ పల్లి లో ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అఫీసుద్దీన్ కు 4500 రూపాయలు లంచం ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. 4500 రూపాయల నగదు సీజ్ చేసి ఆఫీసుద్దీన్ ను అరెస్ట్ చేశారు. మంగళవారం కరీంనగర్ ఏసిబి కోర్టురో హాజరు పరుస్తామని ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.

# వనౌటు దేశంలో భారీ భూకంపం



**7.3 తీవ్రతతో సంభవించిన భూకంపం**

పోర్ట్ విల, డిసెంబర్ 17: పసిఫిక్ ద్వీప దేశం వనౌటు ను భారీ భూకంపం కుదిపేసింది. దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న వనౌటు తీరంలో మంగళవారం ఉదయం అత్యంత శక్తిమంతమైన భూకంపం సంభవించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 7.3గా నమోదైంది. దేశంలోనే అతిపెద్ద నగరమైన రాజధాని పోర్ట్ విలాకు పశ్చిమాన 57 కిలోమీటర్ల లోతులో ఈ భూకంప కేంద్రాన్ని గుర్తించారు. 7.3 తీవ్రత తర్వాత ఇదే ప్రాంతంలో పలు మార్లు 5.3 తీవ్రతతో భూ ప్రకంపనలు నమోదయ్యాయి. భూకంపం ధాటికి ఎత్తైన భవనాలు ఊగిపోయాయి. అనేక భవనాలు, కార్లు దెబ్బతిన్నాయి. పోర్ట్ విలాలోని యూఎస్, యూకే, ఫ్రాన్స్ సహా పలు దేశాల రాయబార కార్యాలయాలు ఉన్న భవనం ధ్వంసమైనట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఈ భూకంపం ఘటనలో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# బాలుడు శ్రీతేజ్ పరిస్థితి విషమం

**థియేటర్ తొక్కిసలాట ఘటన**

**ఆస్పత్రిలో పరామర్శించిన సీపీ సీవీఆనంద్**

**సంధ్య థియేటర్ లైసెన్స్ రద్దు దిశగా చర్యలు**



హైదరాబాద్, డిసెంబర్ 17: ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన బాలుడు శ్రీతేజ్‌కు కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోంది. మంగళవారం కిమ్స్ ఆసుపత్రికి వచ్చిన హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్.. వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి క్రిస్టినాతో కలిసి బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించారు. ‘13 రోజులుగా బాలుడికి చికిత్స కొనసాగుతోంది. ప్రస్తుతం వెంటిలేటర్ సాయంతో చికిత్స అందిస్తున్నారు. డిసెంబరు 4న జరిగిన తొక్కిసలాట ఘటనలో శ్రీతేజ్‌కు ఆక్సిజన్ అందక బ్రెయిన్ డ్యామేజ్ అయింది. వెంటిలేటర్ సాయంతో ఆక్సిజన్ అందిస్తున్నారు. పూర్తిగా కోలుకునేందుకు సమయం పడుతుందని వైద్యులు చెబుతున్నారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు బులిటెన్ విడుదల చేస్తారని సీపీ తెలిపారు. ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇదిలావుంటే ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య థియేటర్‌కు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈనెల 4న రాత్రి పుష్ప–2 ప్రీమియర్ షో సందర్భంగా థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల జరిగిన ఘటనపై లైసెన్స్ ఎందుకు రద్దు చేయకూడదో తెలపాలంటూ నోటీసులు జారీ చేశారు. దీనిపై పది రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. థియేటర్‌కు ఇరువైపులా రెస్టారంట్‌లు ఉన్నాయని, నటులొస్తే భద్రత కల్పించలేమని చిక్కడపల్లి పోలీసులు ముందుగానే హెచ్చరించినట్టు ఓ రిపోర్టు సామాజిక మాధ్యమాల్లో ఇప్పటికే వైరల్ అయింది. సంధ్య 70ఎంఎం, 35ఎంఎం రెండు థియేటర్లు ఒకేచోట ఉండగా, వీటిలో దాదాపు 2,520 సీటింగ్ కెపాసిటీ ఉంది. మహిళలు థియేటర్‌లోకి వెళ్లేందుకు ప్రత్యేకంగా ఎంట్రీ, డిస్‌ప్లే బోర్డులు ఎక్కడా ఏర్పాటు చేయలేదు. ప్రేక్షకులు థియేటర్‌లోకి వెళ్లేందుకు ఒకటే మార్గం ఉంది. ఎక్కువ మంది ప్రేక్షకులు థియేటర్‌కు వచ్చే విధంగా ప్రోత్సహిస్తోన్న యాజమాన్యం .. రద్దీని నియంత్రిచేందుకు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదని పోలీసుల దర్యాప్తులో తేలింది. అల్లు అర్జున్ సంధ్య థియేటర్‌కు వచ్చిన సమయంలో జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతి చెందడం, బాలుడు తీవ్రంగా గాయపడిన ఘటనను పోలీసులు తీవ్రంగా పరిగణించారు. ఈ కేసులో ఇప్పటికే అల్లు అర్జున్‌ను అరెస్టు చేసిన పోలీసులు.. తాజాగా సంధ్య థియేటర్ లైసెన్స్ ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసు ఇచ్చారు.

# ఫాలో ఆన్ తప్పింది..

**కేఎల్ రాహుల్, జడేజా హాఫ్ సెంచరీలు..**
**బుమ్రా, ఆకాశ్ దీప్ పోరాటం..**
**టీమిండియాను ఫాలో ఆన్ నుంచి గట్టెక్కించిన ముగ్గురు**
**తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్లకు 252 రన్స్ చేసిన భారత్**
**డ్రా దిశగా బ్రిస్బేన్ మూడవ టెస్ట్**



బ్రిస్బేన్ టెస్టులో వర్షం.. కేఎల్ రాహుల్, జడేజా హాఫ్ సెంచరీలు.. చివరి వికెట్ పడకుండా బుమ్రా, ఆకాశ్ దీప్ పోరాటం టీమిండియాను ఫాలో ఆన్ గండం నుంచి గట్టెక్కించాయి. ఫాలో ఆన్ తప్పించుకోవాలంటే మరో 33 పరుగులు అవసరమైన వేళ 9వ వికెట్ పడినా.. చివరి వికెట్ కు బుమ్రా, ఆకాశ్ దీప్ అజేయంగా 39 పరుగులు జోడిరచడంతో టీమ్ ఊపిరి పీల్చుకుంది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్ లో 9 వికెట్లకు 252 రన్స్ చేసింది. బ్రిస్బేన్ టెస్టులో ఒక దశలో టీమిండియాకు ఫాలో ఆన్ తప్పదనిపించింది. 44 పరుగులకే 4 వికెట్లు, 74 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన సమయంలో కేఎల్ రాహుల్ (84), రవీంద్ర జడేజా (77) పోరాటం టీమ్ ను ఆదుకుంది. ఆ తర్వాత ఈ గండం నుంచి గట్టెక్కిస్తాడనుకున్న జడేజా కీలకమైన సమయంలో ఔటైనా.. చివరి వికెట్ పడకుండా బుమ్రా, ఆకాశ్ దీప్ చేసిన పోరాటం అసామాన్యం అని చెప్పొచ్చు. వర్షం వల్ల తరచూ అంతరాయాలు కలుగుతున్న ఈ టెస్టులో టీమిండియాను కచ్చితంగా ఫాలో ఆన్ ఆడిస్తే గెలవచ్చని ఆస్ట్రేలియా భావించింది. కానీ బుమ్రా, ఆకాశ్ దీప్ జోడీ ఆ అవకాశం ఇవ్వలేదు. ఊహకందని రీతిలో ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న ఈ ఇద్దరూ చివరి వికెట్ కు ఇప్పటికే 39 పరుగులు జోడిరచారు. ఇందులో ఆకాశ్ దీప్ చేసిన పరుగులే 27 కావడం విశేషం. అందులో రెండు ఫోర్లు, ఒక సిక్స్ ఉన్నాయి. బుమ్రా కూడా 10 పరుగులతో అజేయంగా ఉన్నాడు. వీళ్లిద్దరూ వికెట్ కాపాడుకోవడంతో ఫాలో ఆన్ గండం గట్టెక్కడానికి కావాల్సిన 246 పరుగుల మార్క్ ను టీమిండియా అందుకుంది. ఆ స్కోరు దాటగానే ఆకాశ్ దీప్ ఓ భారీ సిక్స్ కూడా కొట్టాడు. ఆ సమయంలో వెలుతురు సరిగా లేదంటూ ఆటను నిలిపేశారు. దీంతో నాలుగో రోజు ముగిసే సమయానికి ఇండియన్ టీమ్ తొలి ఇన్నింగ్స్ లో 9 వికెట్లకు 252 రన్స్ చేసింది. ఇంకా 193 పరుగులు వెనుకబడి ఉంది.బ్రిస్బేన్ టెస్ట్ ఇక డ్రా అవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ టెస్టు తొలి రోజు ఆట 90 శాతానికిపైగా తుడిచిపెట్టుకుపోయింది. తర్వాతి మూడు రోజులు కూడా వరుణుడు తరుచూ అడ్డుపడుతూనే ఉన్నాడు. దీంతో నాలుగు రోజులు కలిపి కేవలం 191 ఓవర్లు మాత్రమే సాధ్యమయ్యాయి. చివరి రోజు కూడా వర్షం పడే అవకాశాలు ఉన్నాయి. దీనికితోడు టీమిండియా ఫాలో ఆన్ తప్పించుకోవడంతో ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ ఆడాల్సిందే. చివరి రోజు ఇండియన్ టీమ్ చివరి వికెట్ ను త్వరగా తీసి.. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్ లో వేగంగా పరుగులు చేసి రోహిత్ సేనకు కంగారూలు సవాలు విసురుతారా లేక మ్యాచ్ డ్రా కోసమే ఆడతారా అన్నది చూడాలి. చివరి రోజు వర్షం ఆటంకం కలిగించకపోతే మాత్రం ఈ మ్యాచ్ లో ఫలితం కోసం ఆస్ట్రేలియా కచ్చితంగా ప్రయత్నిస్తుందనడంలో సందేహం లేదు.

## కేఎల్ రాహుల్ క్యాచ్‌ను నేలపాలు చేసిన స్టీవ్‌స్మిత్



భారత్‌తో బ్రిస్బేన్‌లోని గబ్బా వేదికగా జరుగుతున్న మూడో టెస్టులో స్టీవ్‌స్మిత్ చేసిన చిన్న తప్పిదం ఆస్ట్రేలియా జట్టుకి శాపంగా మారింది. మ్యాచ్‌లో నాలుగో రోజైన మంగళవారం ఆట మొదటి బంతికే ఆస్ట్రేలియా జట్టుకు వికెట్ దక్కే అవకాశం లభించింది. టీమిండియా ఓపెనర్ కేఎల్ రాహుల్.. సింపుల్‌గా స్లిప్‌లో స్టీవ్‌స్మిత్‌కి క్యాచ్ ఇచ్చాడు. కానీ.. సులువుగా అందుకోవాల్సిన క్యాచ్‌ను తత్తరపాటులో స్టీవ్‌స్మిత్ నేలపాలు చేశాడు. ఆ క్యాచ్ చేజారినప్పుడు కేఎల్ రాహుల్ స్కోరు 33 పరుగులుకాగా.. ఔట్ అయ్యే సమయానికి అతను 139 బంతుల్లో 8 ఫోర్ల సాయంతో 84 పరుగులు చేశాడు. భారత్ జట్టులో కేఎల్ రాహుల్ టాప్ స్కోరర్‌కాగా.. ఒకవేళ మొదటి బంతికే అతను ఔట్ అయ్యి ఉంటే.. మ్యాచ్‌పై టీమిండియా కచ్చితంగా పట్టుకోల్పోయేది. వాస్తవానికి స్టీవ్‌స్మిత్ మంచి ఫీల్డర్. మరీ ముఖ్యంగా టెస్టుల్లో అతను స్లిప్‌లో అద్భుతంగా క్యాచ్‌లు పడుతుంటాడు. కానీ.. ఆట ఆరంభంలోనే కావడంతో కాస్త ఉదాసీనంగా ఉన్నట్లు కనిపించింది. దాంతో మంచి క్యాచింగ్ పొజీషన్‌లో బంతి చేతుల్లోకి వెళ్లినా.. దాన్ని ఒడిసి పట్టుకోలేకపోయాడు. అయితే.. ఎట్టకేలకి కేఎల్ రాహుల్ క్యాచ్‌ని మరోసారి స్లిప్‌లోనే స్టీవ్‌స్మిత్ అందుకున్నాడు. ఆస్ట్రేలియా స్పిన్నర్ నాథన్ లియాన్ బౌలింగ్‌లో బంతిని కట్ చేసేందుకు కేటఎల్ రాహుల్ ప్రయత్నించాడు. షాట్ అతను ఆశించిన విధంగానే కనెక్ట్ అయ్యింది. కానీ స్లిప్‌లో తన పక్క నుంచి గాల్లో వెళ్తున్న బంతిని పక్కకి డైవ్ చేస్తూ ఒంటిచేత్తో స్టీవ్‌స్మిత్ క్యాచ్‌గా అందుకున్నాడు. దాంతో కేఎల్ రాహుల్‌కి సెంచరీ చేజారింది. కానీ.. స్టీవ్‌స్మిత్ తప్పిదం ఖరీదు.. 51 పరుగులు. ఒకవేళ కేఎల్ రాహుల్ 33 పరుగుల వద్ద ఔట్ అయిపోయి ఉండి ఉంటే.. భారత్ కచ్చితంగా ఫాలోఆన్ ఆడాల్సి వచ్చేది.

## ఆకాష్ బౌండరీ కొట్టగానే సెలబ్రేట్ చేసుకున్న గంభీర్..!



భారత్ ను ఫాలో–ఆన్ గండం నుంచి జస్ప్రీత్ బుమ్రా, ఆకాష్ దీప్ గట్టేంకించారు. జస్ప్రీత్ బుమ్రా, ఆకాష్ దీప్ 10వ వికెట్ మంచి భాగస్వామ్యాన్ని నమోదు చేశాడు. వీరిద్దరి వీరోచిత పోరాటంతో భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ వేడుకలు జరుపుకున్నాడు. ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమ్మిన్స్ బౌలింగ్ లో ఆకాష్ దీప్ బౌండరీ కొట్టగా ఇండియా ఫాలో ఆన్ తప్పించుకుంది. దీంతో గంభీర్, కోహ్లీ సెలబ్రేషన్స్ చేసుకున్నారు. హైపై ఇచ్చుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ఆనందంలో ఉన్నట్లు కనిపించాడు. కమ్మింగ్స్ స్టంప్‌పై బాల్ వేయడంతో దాన్ని ఆకాష్ దీప్ డీప్ మిడ్ వికెట్ మీదుగా ఫోర్ కొట్టాడు. ఆ తర్వాత బ్యాడ్ లైట్ కారణంగా అంపైర్లు ఆటను ముగించేశారు. ఆకాశ్ దీప్ 31 బంతుల్లో 27 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మరో ఎండ్‌లో బుమ్రా 27 బంతుల్లో 10 పరుగులు చేశాడు. ఆస్ట్రేలియా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసినా వీరిద్దరు వికెట్ ఇవ్వలేదు. 4వ రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 74.5 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 252 పరుగులు చేసింది. ఇండియా 193 పరుగులు వెనుకబడి ఉంది. ఐదో రోజు టీమిండియా అలౌట్ అయితే ఆస్ట్రేలియా బ్యాటింగ్ చేస్తోంది. వారు ఎప్పటి వరకు బ్యాటింగ్ చేసి డిక్లేర్ చేస్తారో చూడాలి. మరో పక్క రేపు వర్షం కురిసే అవకాశం ఉంది. దీంతో గబ్బా టెస్ట్ డ్రాగా ముగిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. భారత్ నుంచి కేఎల్ రాహుల్ అత్యధిక పరుగులు చేశాడు. 139 బంతుల్లో 84 పరుగులు చేశాడు. ఆ తర్వాత రవీంద్ర జడేజా 123 బంతుల్లో 77 పరుగులు చేశాడు.

## నేపాల్ ప్రీమియర్ లీగ్‌లో ఫన్నీ సన్నివేశం



నేపాల్ ప్రీమియర్ లీగ్ (ఎన్పీఎల్)లో ఒక ఫన్నీ సన్నివేశం చోటు చేసుకుంది. కర్నాలీ యాక్స్, ఫార్ వెస్ట్ రాయల్స్ జట్ల మ్యాచ్ జరగగా.. కర్నాలీ జట్టుకు చెందిన ఓ బ్యాటర్ కామెడీగా స్టంపౌట్ అయ్యాడు. ఈ ఔట్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వాస్తవానికి స్పిన్నర్ వేసిన ఆ బంతిని మెయిన్ అంపైర్ వైడ్‌గా ఇచ్చాడు. ఆ బంతిని చేతుల్లోకి తీసుకోవడంలో కీపర్ విఫలమయ్యాడు. దాంతో బంతి ఎక్కడ ఉందో కనీసం చూసుకోకుండా పరుగు కోసం ప్రయత్నించిన బ్యాటర్.. స్టంపౌట్ అయ్యాడు. దాంతో ఒకే బంతికి.. ఒకే సారి మెయిన్ అంపైర్ వైడ్ ఇవ్వగా.. స్క్వేర్ లెగ్ అంపైర్ ఔట్ ఇచ్చారు. ఫార్ వెస్ట్ జట్టు బౌలర్ హిమ్మత్ సింగ్ తన ఓవర్‌లోని ఆఖరి బంతిని లెగ్ సైడ్ వైడ్ రూపంలో విసిరాడు. దాంతో ఆ బంతిని హిట్ చేయడానికి ప్రయత్నించినా బ్యాటర్ బిపిన్ శర్మ విఫలమయ్యాడు. వికెట్ల వెనుక ఆ బంతిని చేతుల్లోకి తీసుకోవడంలో వికెట్ కీపర్ కూడా తొలుత ఫెయిలయ్యాడు. అయితే.. బంతి కీపర్ ప్యాడ్స్ మధ్యలో ఇరుక్కుంది. కానీ.. బ్యాటర్ బిపిన్ శర్మకు బంతి ఎక్కడుందో తెలుసుకోలేకపోయాడు. బంతి వికెట్ కీపర్‌ను దాటి వెనక్కి వెళ్లిపోయింది అనుకుని.. పరుగు కోసం క్రీజు వెలుపలికి వచ్చాడు. అయితే.. కాళ్ల మధ్య ఇరుక్కుని ఉన్న బంతిని తీసుకున్న వికెట్ కీపర్ క్షణాల్లో బెయిల్స్ ఎగరగొట్టేశాడు. దాంతో ఆశ్చర్యపోయిన బిపిన్ శర్మ నిరాశగా పెవిలియన్ బాట పట్టాల్సి వచ్చింది.

## టీమిండియాకు బ్యాటింగ్ కోచ్ ఉన్నాడా?

**ప్లేయర్ల పతనంపై క్రికెట్ విశ్లేషకుల ఆందోళన**



టీమిండియా బ్యాటింగ్ ప్రదర్శనపై అభిమానులు తీవ్రంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బోర్డర్–గావస్కర్ ట్రోఫీలో బౌలింగ్ విభాగం మంచి ప్రదర్శన చూపించినప్పటికీ, బ్యాటింగ్ విభాగం మాత్రం ఆశించిన స్థాయిలో లేదు. తాజాగా గబ్బా టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో టాపార్డర్ ప్లేయర్లు పతనమవడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చింది. జైస్వాల్, గిల్, విరాట్ కోహ్లీ వంటి ప్రధాన బ్యాటర్లు తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరడం అభిమానులకు అసహనం కలిగించింది. ముఖ్యంగా, ఆటగాళ్లు తప్పిదాలు చేయడంలో కొనసాగుతుంటే, బ్యాటింగ్ కోచ్ పాత్ర ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం టీమిండియా కోచింగ్ స్టాఫ్‌లో గౌతమ్ గంభీర్ ప్రధాన కోచ్‌గా ఉండగా, రియాన్ టెన్ డెష్కటే, అభిషేక్ నాయర్ సహాయ కోచ్‌లుగా ఉన్నారు. బౌలింగ్ విభాగానికి సౌతాఫ్రికా మాజీ క్రికెటర్ మోర్నీ మోర్కెల్ మార్గనిర్దేశం చేస్తున్నారు. అయితే, బ్యాటింగ్ కోచ్ విషయంలో స్పష్టత లేకపోవడం అభిమానులను, క్రికెట్ విశ్లేషకులను ఆందోళనకు గురిచేస్తోంది. టాలెంటెడ్ ప్లేయర్లతో కూడిన జట్టులో కూడా బ్యాటింగ్ లోపాలు ఎప్పటికీ పరిష్కరించబడటం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ కూడా ఇదే అంశాన్ని లేవనెత్తాడు. ''జట్టులో కొంతమంది బ్యాటర్ల సమస్యలు ఇంతకాలం ఎందుకు పరిష్కారం కావడం లేదు?'' అంటూ మంజ్రేకర్ ట్వీట్ చేయడం హాట్ టాపిక్‌గా మారింది. అభిమానులు ఈ అంశంపై మిశ్రమ స్పందన తెలియజేస్తున్నారు. కొందరు ''టీమిండియాకు బ్యాటింగ్ కోచ్ అవసరం'' అని అభిప్రాయపడుతుండగా, మరికొందరు ''విరాట్, రోహిత్ వంటి ఆటగాళ్లకు కోచ్ అవసరం లేదని'' అంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో టీమిండియా బ్యాటింగ్ లోపాలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా, బలహీనమైన యాక్షన్ ప్లాన్ కారణంగా కీలకమైన మ్యాచ్‌ల్లో నిరాశపరచడం ఆందోళన కలిగిస్తోంది.

## రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలుపై జోరుగా ప్రచారం



టెస్ట్ ఫార్మాట్‌లో పేలవ ఫామ్‌తో సతమతమవుతున్న టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ సంచలన నిర్ణయం తీసుకున్నాడా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గబ్బా టెస్ట్ అనంతరం రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతాడనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఐదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా గబ్బా వేదికగా జరుగుతున్న మూడో టెస్టులోనూ రోహిత్ శర్మ(10) దారుణంగా విఫలమయ్యాడు.ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ బౌలింగ్‌లో రోహిత్ కీపర్ క్యాచ్‌గా వెనుదిరిగాడు. గుడ్ లెంగ్త్ బాల్‌ను డ్రైవ్ షాట్ ఆడే ప్రయత్నం చేసి మూల్యం చెల్లించుకున్నాడు. కేఎల్ రాహుల్ కోసం నెంబర్ 6లో బ్యాటింగ్‌కు వచ్చిన రోహిత్.. ఎదుర్కొన్న తొలి బంతి నుంచే చాలా అసౌకర్యంగా కనిపించాడు. ముఖ్యంగా అతని ఫుట్‌వర్క్ చాలా పేలవంగా కనిపించింది. బంతి వచ్చేవరకు ఎదురు చూసేంత ఓపిక అతని ఆటలో కనిపించలేదు. క్రీజులో ఏ మాత్రం కదలకుండా షాట్ ఆడి మూల్యం చెల్లించుకున్నాడు.దాంతో తీవ్ర అసంతృప్తికి గురైన రోహిత్ శర్మ తన గ్లౌజ్‌లను డగౌట్ వద్దే పడేసి డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లాడు. ఈ ఘటన అందర్నీ షాక్‌కు గురి చేసింది. వరుసగా విఫలమవుతుండటంతో రోహిత్ భావోద్వేగపూరితమైన నిర్ణయం తీసుకున్నాడా? అనే చర్చ మొదలైంది. గబ్బా టెస్ట్ ముగిసిన తర్వాత సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలుకుతాడనే ఊహాగానాలు తెరపైకి వచ్చాయి. గతంలో మహేంద్ర సింగ్ ధోనీ కూడా ఆస్ట్రేలియా పర్యటన మధ్యలోనే టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ధోనీ తరహాలోనే రోహిత్ సైతం సంచలన నిర్ణయం తీసుకుంటాడని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. ఈ సిరీస్‌లో మూడు ఇన్నింగ్స్‌ల్లో 6 స్థానంలో బ్యాటింగ్ చేసిన రోహిత్.. మూడిరటిలోనూ దారుణంగా విఫలమయ్యాడు. గత రెండేళ్ల నుంచి సుదీర్ఘ ఫార్మాట్‌లో రోహిత్ ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. మొత్తం 10 టెస్టులు.. 18 ఇన్నింగ్స్‌ల్లో 621 పరుగులు మాత్రమే చేశాడు. అతని టెస్ట్ కెరీర్ బ్యాటింగ్ సగటు 45 కాగా.. ఈ 18 ఇన్నింగ్స్‌ల్లో యావరేజ్ 34. ముఖ్యంగా స్వదేశంలో 62 యావరేజ్‌తో ఆడే రోహిత్ శర్మ.. విదేశాల్లో మాత్రం 33 సగటు మాత్రమే నమోదు చేశాడు. ఇప్పటికే టీ20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన రోహిత్ శర్మ.. టెస్ట్, వన్డే ఫార్మాట్‌లోనే కొనసాగుతున్నాడు. టీ20 ప్రపంచకప్ 2024 విజయానంతరం పొట్టి ఫార్మాట్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు రోహిత్ శర్మ ప్రకటించాడు. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 అనంతరం వన్డే ఫార్మాట్‌కు వీడ్కోలు పలికే అవకాశం ఉన్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది.డబ్ల్యూటీసీ ఫైనల్ తర్వాత సుదీర్ఘ ఫార్మాట్‌కు కూడా రోహిత్ రిటైర్మెంట్ ప్రకటిస్తాడని ప్రచారం జరిగి.. భారత్ ఫైనల్ చేరే అవకాశాలు కనిపించడం లేదు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని గెలిస్తేనే భారత్‌కు డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ దక్కనుంది. ఇప్పటికే రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించాలంటూ నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు.

## రోహిత్, కోహ్లీలను నేను తిట్టలేదు: అనిల్ కుంబ్లే



టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీలను తాను విమర్శించినట్లు సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారం అవాస్తవమని దిగ్గజ స్పిన్నర్ అనిల్ కుంబ్లే అన్నాడు. తాను ఎవరినీ విమర్శించలేదని స్పష్టం చేశాడు. ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో గబ్బా వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్‌లో టీమిండియా తడబడుతోంది. దాంతో రోహిత్ శర్మ కెప్టెన్సీ, విరాట్ కోహ్లీ బ్యాటింగ్‌పై అనిల్ కుంబ్లే ఘాటు వ్యాఖ్యలు చేసినట్లు సోషల్ మీడియా వేదికగా జోరుగా ప్రచారం జరుగుతోంది.రోహిత్ శర్మ కెప్టెన్సీ తనకు అర్థం కావడం లేదని, ట్రావిస్ హెడ్‌ను ఔట్ చేసే ప్రణాళికలు లేకపోవడం ఏంటని కుంబ్లే అన్నట్లు కొందరు ఆకతాయిలు ఫేక్ పోస్ట్‌లు సృష్టించారు. అంతేకాకుండా తొలి ఇన్నింగ్స్‌లో విరాట్ కోహ్లీ విఫలమైన అనంతరం.. కుంబ్లే ఘాటు వ్యాఖ్యలు చేశారని అసత్య ప్రచారం చేశారు. గత ఐదేళ్లుగా కోహ్లీ సరిగ్గా ఆడటం లేదని, అతన్ని ఎవరూ ప్రశ్నించడం లేదని కుంబ్లే మండిపడినట్లు పోస్ట్‌లు క్రియేట్ చేశారు. కోహ్లీ లగేజీ సర్దుకొని లండన్ సెటిల్ అవ్వడం ఉత్తమమని కుంబ్లే అన్నట్లు ప్రచారం జరిగింది. అయితే ఈ నకిలీ వార్తలపై కుంబ్లే స్పందించాడు. వాటితో తనకు ఎలాంటి సంబంధం లేదని ఎక్స్‌వేదికగా స్పష్టం చేశాడు. 'కొన్ని సోషల్ మీడియా ఖాతాలు నా ఫొటోను ఉపయోగిస్తూ నేను అనని మాటలు అన్నట్లు ఫేక్ పోస్ట్‌లు సృష్టించాయి. అవి నా దృష్టికి వచ్చాయి. ఆ ఖాతాలు.. వాటిలో సమాచారంతో నాకు ఎలాంటి సంబంధం లేదు. ఆ వ్యాఖ్యలు నేను చేయలేదు. ఇలాంటి వాటి విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలి. సోషల్ మీడియా వచ్చే ప్రతీదాన్ని నమ్మొద్దు. ఏదైనా సమాచారాన్ని షేర్ చేసే ముందు అది సరైనదో కాదో క్రాస్ చెక్ చేసుకోవాలి. నా అధికారిక సోషల్ మీడియా ఖాతాల నుంచి వచ్చే సమాచారాన్ని మాత్రమే నమ్మండి.'అని కుంబ్లే ఎక్స్ వేదికగా అభిమానులను కోరాడు.

# సినిమా






## శోభా నాగిరెడ్డి జయంతి సందర్భంగానే ఇక్కడకు వచ్చా : మంచుమనోజ్

మంచు మనోజ్ రాజకీయాల్లోకి రాబోతున్నాడనే వార్త ఇటీవల వైరల్‌గా మారింది. మంచు ఫ్యామిలీతో విబేధాలు కలకలం రేపుతున్న తరుణంలో మనోజ్ జనసేనలోకి చేరుతాడని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో తన పొలిటికల్ ఎంట్రీపై మంచు మనోజ్ క్లారిటీ ఇచ్చాడు. శోభా నాగిరెడ్డి జయంతి సందర్భంగా సోమవారం నాడు ఆళ్ల గడ్డకు వచ్చిన మంచు మనోజ్.. రాజకీయాల్లోకి రాబోతున్నట్లు జరుగుతున్న ప్రచారంపై స్పందించారు. పొలిటికల్ ఎంట్రీపై ప్రస్తుతానికి తానేమీ చెప్పలేనంటూ విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. మీరు జనసేనలోకి వెళ్లబోతున్నట్లు జరుగుతున్న ప్రచారంపై ఏం సమాధానం చెబుతారని అడగ్గా.. నో కామెంట్స్ అంటూ నవ్వుతూ వెళ్లి పోయాడు. తన అత్తయ్య శోభా నాగిరెడ్డి జయంతి సందర్భంగా నివాళులు అర్పించేందుకు మాత్రమే ఆళ్లగడ్డకు వచ్చినట్లు మంచు మనోజ్ వివరించారు. తమ కూతురు దేవసేన శోభను తొలిసారిగా ఆళ్లగడ్డకు తీసుకొచ్చామని చెప్పారు. జయంతి రోజునే తీసుకొద్దా మనే ఉద్దేశంతో ఇన్నాళ్లూ ఇక్కడకు తీసుకురాలేదని తెలిపారు. మా ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో కలిసి ఇక్కడకు వచ్చారని అన్నారు. తన కోసం ఆళ్లగడ్డకు తరలివచ్చిన అందరికీ ధన్య వాదాలు తెలిపారు.

## మంచు మనోజ్ కంప్లయింట్‌లో ఎలాంటి నిజం లేదు

### పోలీసులకు నిర్మలాదేవి లేఖ

మంచు మోహన్ బాబు ఫ్యామిలీ వార్ ఇటు సినీ, అటు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. తండ్రీ కొడుకులు (మంచు మనోజ్, మంచు మోహన్‌బాబు) ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకుంటున్నారు. పోలీస్ కంప్లెయింట్లు ఇచ్చుకుంటున్నారు. తన తల్లి నిర్మలా దేవి బర్త్‌డే పార్టీ శనివారం రాత్రి జరుగుతుండగా.. మంచు విష్ణుకి చెందిన మనుషులు జనరేటర్‌లో పంచదార పోశారంటూ మంచు మనోజ్ ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై నిర్మలా దేవి తాజాగా స్పందించారు. మంచు మనోజ్ ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు వివరణ ఇస్తూ పహాడి షరీఫ్ పోలీసులకు మంచు నిర్మలా దేవి లేఖ రాశారు. డిసెంబర్ 14వ తేదీన తన పుట్టిన రోజు సందర్భంగా విష్ణు జల్‌పల్లి నివాసానికి వచ్చాడని తెలిపారు. తనతో కేక్ కట్ చేయించి బర్త్‌డే సెలబ్రేట్ చేసినట్లు చెప్పారు. విష్ణు ఎలాంటి దౌర్జన్యానికీ పాల్పడలేదని స్పష్టం చేశారు. మనోజ్ ఇచ్చిన కంప్లెయింట్‌లో నిజం లేదన్నారు. విష్ణు తన పుట్టిన రోజును సెలబ్రేట్ చేసి.. తన గదిలోని సామాను తీసుకొని వెళ్లిపోయినట్లు వివరించారు. అంతకు మించి అక్కడ ఎలాంటి గొడవా జరగలేదని మంచు నిర్మలా దేవి లేఖలో స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ లేఖ చర్చనీయాంశంగా మారింది.



## తొలసారి నాగచైనత్యను శోభిత అప్పుడే చూసిందంట..!

టాలీవుడ్ సెలబ్రిటీలు అక్కినేని నాగచైతన్య–శోభిత ధూళిపాళ్ల ఇటీవలే వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారని తెలిసిందే. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈ ఇద్దరు తమ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను తాజాగా ఇంటర్వ్యూలో షేర్ చేసుకున్నారు. 2018లో నాగార్జున నివాసంలో నాగచైతన్య–శోభిత తొలిసారి కలిశారట. స్పై సినిమా గూడఛారిలో తన యాక్టింగ్‌కు ఇంప్రెస్ అయి చైతూ నాన్న నాగార్జున ఇంటికి ఆహ్వానించారని చెప్పింది శోభిత. ఇక సోషల్ మీడియాలో ఒకరినొకరు యాడ్ చేసుకున్న వీరిద్దరూ 2022లో మొదటి సారి చిట్ చాట్ చేశారు. ఆహారం పట్ల తమకున్న ఇష్టం, ప్రేమ గురించి నెట్టింట షేర్ చేసుకున్నారు. ఇద్దరూ ఎప్పుడు కలిసినా ఆహారం గురించి చర్చించుకునేవాళ్లమంది శోభిత. చైతూ తనను తెలుగులో మాట్లాడమని ఎప్పుడూ అడిగేవాడని.. తెలుగులో మాట్లాడటం వల్ల తమ రిలేషన్‌షిప్ మరింత బలపడిరదని చెప్పింది. ఇక రెండు వారాల తర్వాత నాగ చైతన్య తనతో కలిసి లంచ్ చేయడానికి ఫ్లైట్‌లో ముంబైకి వచ్చాడని శోభిత పేర్కొంది. అది చాలా మనోహరమైన విషయం. నేను నెట్టింట టెక్స్టింగ్ చేసేందుకు.. సోషల్ మీడియాలో కమ్యూనికేట్ చేయడానికి అభిమానిని కాదని.. అమెజాన్ ప్రైమ్ వీడియో ఈవెంట్‌లో తాము మళ్లీ కలుసుకున్నామని.. తాను రెడ్ డ్రెస్‌లో ఉండగా.. చైతూ బ్లూ సూట్‌లో ఉన్నాడంటూ చెప్పుకొచ్చింది చెప్పింది. తాము తొలిసారి ముంబైలోని ఓ కేఫ్‌లో కలుసుకు న్నామన్న శోభిత.. అప్పుడు తాను ముంబైలో..నాగచైతన్య హైదరాబాద్‌లో ఉండేవాళ్లమంది. తన కోసం చైతూ తరచూ హైద రాబాద్ నుంచి ముంబైకి వచ్చేవాడని తెలిపింది. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. నాగచైతన్య ఫ్యామిలీ న్యూఇయర్ వేడుకలకు నన్ను ఆహ్వానించారు. ఆ తర్వాతి ఏడాదే చైతన్య తన కుటుంబాన్ని కలిశాడని చెప్పింది శోభిత. ఒక రినొకరు అర్థం చేసుకున్న తర్వాత ఈ ఏడాది గోవాలో పెళ్లి ప్రపోజల్ తీసుకొచ్చినట్టు చెప్పింది.

## టాలీవుడ్ మరింత దగ్గరగా విజయ్‌సేతుపతి



తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని విజయ్ సేతుపతి. ఈ స్టార్ యాక్టర్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం విడుదల పార్ట్ 2. కోలీవుడ్ దర్శకుడు వెట్రిమారన్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మక్కళ్ సెల్వన్ టీం ప్రమోషన్స్‌లో భాగంగా హైదరా బాద్‌లో సందడి చేసింది. కాగా సైరా నరసింహారెడ్డి సినిమాలో కీలక పాత్రలో నటించిన విజయ్ సేతుపతి.. లీడ్ రోల్‌లో డైరెక్ట్‌గా తెలుగు సినిమా మాత్రం చేయలేదు. ప్రమోషన్స్ సందర్భంగా విజయ్ సేతుపతి లీడ్ రోల్‌లో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చే విషయంపై క్లారిటీ ఇచ్చాడు. టాలీవుడ్ దర్శకులు సిద్ధం చేసిన కథలను వింటున్నానని.. తెలుగు సినిమా డెబ్యూకు అవకాశముందని హింట్ ఇచ్చేశాడు. టాలీవుడ్ డెబ్యూపై స్పందిస్తూ.. నేను అదే పనిలో ఉన్నా. త్వరలోనే అది జరుగ వచ్చన్నాడు విజయ్ సేతుపతి. ఇప్పుడీ కామెంట్స్‌తో అభిమానులు, మూవీ లవర్స్ ఫుల్ ఖుషీ అవు తున్నారు. ఇదే నిజమైతే మరి విజయ్ సేతుపతిని తెలుగులో ఎలివేట్ చేసే ఆ దర్శకుడెవరన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది. కాగా విడుదల పార్ట్ 2లో సూరి మరో ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. మంజు వారియర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి.

## హీరోలకు అదొక హెచ్చరిక





### అల్లు అర్జున్ అరెస్టుపై సుమన్ కామెంట్

ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనకు సంబంధించిన టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ తర్వాత బెయిల్‌పై విడుదలయ్యాడు బన్నీ. అల్లు అర్జున్ అరెస్ట్‌పై ఇప్పటికే దేశ వ్యాప్తంగా పలువురు సెలబ్రిటీలు తమ స్పందనను తెలియజేశారు. తాజాగా ఈ విషయమై సీనియర్ నటుడు సుమన్ స్పందించారు. అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడం సరైంది కాదన్నాడు సుమన్. థియేటర్ వాళ్లే హీరోలను పిలుస్తుంటారు. తనను కూడా అప్పట్లో పిలిచేవారని.. తాము ఎప్పుడొస్తారో చెబితే థియేటర్ వాళ్లు ఏర్పాట్లు చేస్తామం టారన్నాడు. హీరో వచ్చినప్పుడు అతడితోపాటు జనాల రద్దీని నియంత్రించే బాధ్యతంతా కూడా థియేటర్ యాజమాన్యానిదేనన్నాడు. హీరోను ఇలా అరెస్ట్ చేయడం తప్పన్న సుమన్.. ఏదేమైనా జరిగిన ఘటనను మార్చలేం. కానీ ఇక ముందు హీరోలకు హెచ్చరిక.. హీరోలు అలా వెళ్లినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చూశాడు. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ ప్రాణాలు కోల్పోగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను ప్రస్తుతానికి తాను కలవలేక పోతున్నానంటూ.. త్వరలో వారి కుటుంబాన్ని కలుస్తానని ఇప్పటికే ఎక్స్ ద్వారా క్లారిటీ ఇచ్చాడు అల్లు అర్జున్.



## అడివిశేష్‌తో మృనాల్ ఠాగూర్ సినిమా

టాలీవుడ్ హీరో అడివిశేష్ కాంపౌండ్ నుంచి బ్యాక్ టు బ్యాక్ సినిమాలు లైన్‌లో ఉన్నాయని తెలిసిందే. వీటిలో ఒకటి డెకాయిట్ . షనీల్ డియో కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్నాడు. అంతా అనుకున్నట్టుగా ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్‌ను ఫీ మేల్ లీడ్ రోల్‌లో ఫైనల్ చేశారు. చాలా రోజుల తర్వాత సస్పెన్స్‌కు తెరదించుతూ కొత్త లుక్ విడుదల చేశారు. డెకాయిట్ టీం కొత్త పోస్టర్‌లో మృణాల్ ఠాకూర్ ఓ చేత్తో స్టీరింగ్ తిప్పుతూ.. మరోచేతిలో పిస్తోల్ పట్టుకొని కనిపిస్తుంది. పక్కనే అడివి శేష్ సిగరెట్ వెలిగిస్తున్నాడు. అవును వదిలేసాను.. కానీ మనస్ఫూర్తిగా ప్రేమించాను.. అడివిశేష్‌కు బర్త్ డే విషెస్ తెలియజేసింది మృణాల్ ఠాకూర్. డెకాయిట్‌లో హీరోహీరోయిన్లిద్దరూ ఏదో మిషన్‌లో పాల్గొంటున్నట్టుగా ఉన్న తాజా పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీతోపాటు అంచనాలు అమాంతం పెంచేస్తుంది. ఈ ఏడాది ఫ్యామిలీ స్టార్, కల్కి 2898 ఏడీ చిత్రాల్లో మెరిసిన మృణాల్ ఠాకూర్ ప్రస్తుతం నాలుగు హిందీ సినిమాల్లో నటిస్తోంది. అడివి శేష్ మరోవైపు వినయ్ కుమార్ దర్శకత్వం 'గూఢ చారి' సీక్వెల్ 'జీ2'లో కూడా నటిస్తున్నాడు. ఈ మూవీ పోస్టర్లు ఇప్పటికే సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. ఈ చిత్రాన్ని పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్‌లపై టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.

## ఏడాదికో సినిమా చేయాలనుకుంటున్నా : అమీర్‌ఖాన్



ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్న స్టార్ యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు అమీర్ ఖాన్. ఇండస్ట్రీకి ఎన్నో సూపర్ హిట్స్ అందించిన అమీర్ ఖాన్.. చాలా రోజులుగా మంచి బ్రేక్ కోసం ఎదురుచూస్తున్నాడు. తాజాగా ఓ చిట్‌చాట్ సెషన్‌లో ఈ స్టార్ హీరో చేసిన కామెంట్స్ అభిమానులు, ఫాలోవర్లలో ఫుల్ జోష్ నింపుతున్నాయి. ఓ నటుడిగా ఏడాదికో సినిమా చేయాలని అనుకుంటున్నానన్నాడు అమీర్‌ఖాన్. అంతేకాదు వచ్చే పదేళ్లలో మరిన్ని సినిమాలను నిర్మించాలనుకుంటు న్నానన్నాడు. అంతేకాదు తన డ్రీమ్ ప్రాజెక్ట్ మహాభారత్‌ను తెరకెక్కించాలనుకుంటు న్నట్టు చెప్పాడు. ఒకవేళ నేను ఈ సినిమా చేయగలిగితే.. ఈ ప్రాజెక్టుతో ప్రతీ భారతీ యుడు గర్వపడేలా చేయాలని, భారతదేశం గురించి ప్రపంచానికి చూపించాలను కుంటున్నానన్నాడు. అవార్డ్స్ షోలకు నో చెప్పడం గురించి ప్రశ్నించగా.. సినిమా అనేది సబ్జెక్ట్ ఓరియెంటెడ్‌గా సాగుతుంది.. ప్రతీ సినిమా సొంత కథను కలిగి ఉంటుందని చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం సితారే జమీన్ పర్, కూలీ, లాహోర్ 1947 సినిమాలు అమీర్ ఖాన్ ఖాతాలో ఉన్నాయి. తలైవా నటిస్తోన్న కూలీ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తుండగా.. సతారే జమీన్ పర్, లాహోర్ 1947 చిత్రాలకు నిర్మాతగా వ్యవహరిస్తున్నాడు. 2022లో వచ్చిన లాల్ సింగ్ చద్దా సినిమా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. దీంతో హీరోగా కొత్త సినిమాలేమి ప్రకటించలేదు. మరి తాజా కామెంట్స్‌తో అమీర్‌ఖాన్ నుంచి ఇక బ్యాక్ టు బ్యాక్ సినిమాలుండబోతున్నాయని అర్థం చేసుకోవచ్చు.